ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

అక్టోబర్ 2009

వెల : రూ. 10

na Math Hyderabad www.rkmath.org

సుబోధ

జగన్మాతని శ్రీరామకృష్ణులు ఇలా ప్రార్థించేవారు:

“అమ్మా! జగజ్జననీ! నాకు లోకుల వల్ల గౌరవం వద్దు, విషయభోగాలు వద్దు; గంగా యమునా శాశ్వత సంగమం మాదిరి నా ఆత్మ నీలో లయించుగాక! ఇదే నేను కోరేది. అమ్మా! నేను భక్తిహీనుణ్ణి, యోగహీనుణ్ణి, దీనుణ్ణి, నిస్సహాయుణ్ణి, నాకొకరి మెప్పు వద్దు; నీ దివ్య పాదారవిందాల్లోనే నా మనస్సు నిరంతరం నిలుచుగాక!”

అమ్మ నన్ను సామాన్య భక్తుడి స్థాయిలో ఉంచింది. అందువల్లే రాఖాల్ (స్వామి బ్రహ్మానంద)తోనూ, ఇతరులతోనూ పరిహసించ గలుగుతున్నాను. నేనే కనుక జ్ఞాని స్థాయిలో ఉండి ఉంటే, ఇది సాధ్యం కాకపోయేది. సర్వత్రా కాళీమాతయే – లోకేశ్వరే – నాకు గోచరిస్తోంది.

పండితులూ, పామరులూ కూడా అమ్మే అయి ఉందని కాళికాలయంలో నాకు గోచరించింది. నేనెంత ప్రయత్నించినా రామలాల్ తల్లిని దూషించలేక పోయాను. అమ్మే మరో రూపంలో ఆమెగా ఉందని నాకు అనిపించింది.

సమస్తం చిన్మయమని అకస్మాత్తుగా ఒకరోజు నాకు విదితమైంది. పూజాపాత్రలు, వేదిక, ద్వారం – సర్వం చిన్మయమై గోచరించాయి. మానవులు, మృగాలు, పక్షులు – సర్వం చిన్మయమే. నేనప్పుడు చూసినదానినల్లా పూజించేవాణ్ణి. భగవత్సాక్షాత్కారంతో సమస్త కర్మలూ తొలగిపోతాయి. నా పూజాకలాపం ఈ విధంగానే అంతమయింది. ❖

(‘శ్రీరామకృష్ణ బోధామృతం’ నుంచి)

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్ – 500 029
ఫోన్: 040–2766 7799, 2763 3936
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 66 | సంచిక: 10 | అక్టోబర్ 2009

యాం హన్తుం మధుకైటభౌ జలజభూస్తుష్టావ సు ప్తే హరౌ
నీలాశ్మద్యుతిమాస్యపాదదశకాం సేవే మహాకాళికామ్ ॥

విష్ణువు యోగనిద్రలో ఉండగా మధుకైటభాసురులను వధించుట కోసం బ్రహ్మదేవునిచేత స్తుతింపబడి, ఇంద్రనీలమణివంటి శరీరకాంతితో పది ముఖాలు, పది పాదాలుగల మహాకాళికా దేవిని నేను సేవిస్తున్నాను. *(మహాకాళీ ధ్యానం - దేవీ మాహాత్మ్యం నుంచి)*

లోపలి పేజీల్లో...

4 సంపాదకీయం – త్రిగుణాలను తొలగించే త్రివిక్రముడు!

11 దేవీ వైభవం

6 గోరుముద్ద – మొండితనం - పట్టుదల

13 ధీరవాణి – ఆత్మారాముడివై జీవించు

7 భగవన్నామం ఓ దివ్య ఔషధం

14 పరిప్రశ్న

8 భక్తునిలో విశ్వాసాన్ని పెంచిన భగవంతుడు



15 ఆచారవ్యవహారాలు-అంతరార్థాలు – నారికేళ విశిష్టత

9 పరమేశ్వరుని పరిరక్షణలో... – మహరాజ్ మాటతో మారిన మనిషి

16 బొమ్మల కథ – నది మార్గాన్ని మళ్ళించిన మహర్షి



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'లో సభ్యులుగా చేరి ధనదానం చేయాల్సిందిగా మనవి. సభ్యుల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు...... రూ. 10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............ రూ. 5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................. రూ. 1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు / చిరునామా	రూ.
మహారాజ పోషకులు	: శ్రీమతి & శ్రీ కోట రామ సూర్యనారాయణ, తణుకు, పశ్చిమగోదావరి జిల్లా	10,000
రాజ పోషకులు	: శ్రీ బరడి నవీన్ కుమార్, భ్రమరాంబికా నగర్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్	5,000
పోషకులు	: శ్రీ కాళ్ళకూరి సుబ్బారావు, సరిపల్లి, పశ్చిమగోదావరి జిల్లా (కీ॥శే॥ కాళ్ళకూరి చంద్రమ్మ జ్ఞాపకార్థం)	1,116
	: శ్రీ సి. మాలకొండయ్య, ట్రంక్‌రోడ్, నెల్లూరు.	1,001

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

ప్రియ భక్తులారా!

యువతరంలో ఆత్మవిశ్వాసాన్ని నింపే యువనాయక స్వామి వివేకానంద స్ఫూర్తివచనాలతో వెలువడుతున్న 'శ్రీరామకృష్ణ ప్రభ'ను రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకూ, కళాశాలలకూ అందించాలని సంకల్పించాం.

శ్రీరామకృష్ణుల, స్వామి వివేకానందుల సందేశాల ఆవశ్యకతను గురించి సుభాష్ చంద్రబోస్ ఒక సందర్భంలో చెబుతూ, "శీలనిర్మాణానికి రామకృష్ణ - వివేకానంద సాహిత్యం కన్నా ఉన్నతమైన సాహిత్యం వేరొకటి లేదు" అని అన్నారు.

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయడానికి మీ ఆర్థిక సహాయాన్ని కోరుతున్నాం. ఈ పథకం కింద రూ. 1500 మొత్తాన్ని జీవిత చందా (20 సంవత్సరాలకు) కట్టినట్లయితే మీరు సూచించిన, లేదా మేము ఎంపిక చేసిన ఒక పాఠశాల/కళాశాలకు 20 ఏళ్ళ పాటు పత్రికను మీ పేరున పంపుతాం. చందాదారుని పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

మీ చందాను ఎమ్.ఓ. / డి.డి./ చెక్కు రూపంలో Ramakrishna Math, Hyderabad పేరున తీసుకొని, Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029 చిరునామాకు పంపవలెను.

స్వామీజీ ఆదర్శాలకు అనుగుణంగా యువతరాన్ని తీర్చిదిద్దడంలో 'శ్రీరామకృష్ణ ప్రభ' చేపట్టిన ఈ పథకానికి చేయూతనందించగలరని ఆశిస్తున్నాం. భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ప్రార్థిస్తూ...

భగవత్సేవలో
స్వామి జ్ఞానదానంద
అధ్యక్షులు

ముఖచిత్రం : కలకత్తా దక్షిణేశ్వరంలో గంగాతీరాన వెలసిన 'భవతారిణీ కాళికాలయం'. శ్రీరామకృష్ణ పరమహంస ఆరాధించిన చిన్మయమూర్తి కాళీమాత కొలువుదీరిన ఆలయం ఇదే! *(ముఖచిత్ర కథనం - పేజీ 10లో చూడండి)*

ADVERTISEMENT TARIFF

	MULTI COLOUR	B & W
Fourth Cover	Rs.25,000	-
Second Cover	Rs.20,000	-
Third Cover	Rs.20,000	-
Inside Full Page	Rs.15,000	10,000
Inside Half Page	Rs.10,000	5,000

చందా వివరాలు

చందా వివరాలు	ఇండియాలో	విదేశాలలో
విడి ప్రతి	: రూ. 10	-
ఒక సంవత్సర చందా	: రూ. 100	$ 25
మూడు సంవత్సరాలకు	: రూ. 280	$ 55
ఐదు సంవత్సరాలకు	: రూ. 450	$ 85
ఇరవై సంవత్సరాలకు	: రూ. 1500	$ 365

గమనిక : డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో **Ramakrishna Math, Hyderabad** అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా : **Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.**

లోపలి పేజీల్లో...

18
అయిదు రోజుల
ఆనందోత్సాహాల పండుగ



27
యువత - ఆధ్యాత్మికత

20
ఓ మహాత్యాగి ఆత్మకథ
(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

29
ముందుకు సాగిపో!

22
ప్రాచీన గాథలు: జీవన వికాసం
రంతిదేవుడి దానగుణం

30
మౌనంగా బోధించిన మునీంద్రుడు
సదాశివ బ్రహ్మేంద్రుడు

24
చిగురంత ఆశతో ముందడుగు వేద్దాం

33
నా జీవితంలో స్వామి వివేకానంద
వివేక నాదమే వారి జీవన వేదం!

25
యువవాణి
నవతరం సందేహాలకు సమాధానాలు

34
మహనీయుల జీవితాల్లో మధురఘట్టాలు
సత్యనిష్ఠలో స్థిరచిత్తుడు

26
అహింసో పరమోధర్మః

35
ఆగండి! ఆస్వాదించండి!!

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- **'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు పైన చిరునామాకు కుడి భాగంలో మీ చందా గడువు ముగిసే నెల వ్రాసి ఉంది. సకాలంలో సొమ్ము** *చెల్లించి, చందా పొడిగించుకోండి. 'శ్రీరామకృష్ణ ప్రభ' ఆధ్యాత్మిక వెలుగులు మీ ఇంట నిరంతరాయంగా ప్రసరించేలా సహకరించండి.*
- **మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నెంబరు పేర్కొనాల్సిందిగా మనవి.**
- **మీ చిరునామా మారితే వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.**
- **పత్రిక ప్రతీ నెల 26వ తేదీన పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపు చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.**

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ....

- సర్క్యులేషన్ మేనేజర్

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు.

- సంపాదకులు

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
Domalguda, Hyderabad - 500 029. Andhra Pradesh
Phone No: 040 - 2766 7799, E-mail : sriramakrishnaprabha@gmail.com

సంపాదకీయం

త్రిగుణాలను తొలగించే త్రివిక్రముడు!

'దీపావళి' అంటే దీపాల వరుస. దీపం జ్ఞానానికీ, ఆనందానికీ సంకేతం. మన జీవితంలోని దుఃఖమనే చీకటిని పారద్రోలి, ఆనందమనే వెలుగును నింపాలనే ఉద్దేశంతో జరుపుకొనే పర్వదినం 'దీపావళి'.

'దీపావళి' అనేక దేవీదేవతలతో సంబంధం కలిగి ఉండడం ఓ విశేషం. శ్రీరాముడు అరణ్యవాసం ముగించి తిరిగివచ్చిన సందర్భంలో ఆనందంతో జరిపిన ఉత్సవమనీ, శ్రీకృష్ణుడు సత్యభామ సహాయంతో నరకాసురుణ్ణి సంహరించిన శుభదినమనీ, క్షీరసాగర మథనంలో లక్ష్మీదేవి ఆవిర్భవించిన పవిత్ర దినమనీ, కాళీమాత అవతరించిన కాళరాత్రనీ, బలిచక్రవర్తి దాననిరతికి మెచ్చి జరిపే ఉత్సవమనీ, ఆయన పాతాళ లోకం నుంచి ప్రజల క్షేమాన్ని విచారించడానికి భువిపైకి వచ్చిన దినమనీ-ఇలా అనేక సందర్భాలను పురస్కరించుకొని భారతీయులంతా జరుపుకొనే పర్వదినం 'దీపావళి'.

సాక్షాత్తూ విష్ణుమూర్తి అవతారమైన వామనుడు కీర్తించిన మహోన్నత వ్యక్తి బలిచక్రవర్తి. ఆ దానవరాజు దానగుణానికి వామనుడు సంతృప్తి చెంది, ఈ భువిపై ఆచంద్రార్కం ఆరాధనలు అందుకుంటావని బలిచక్రవర్తిని ఆశీర్వదించాడు. అదే 'దీపాళికోత్సవం' అని శ్రీకృష్ణుడు ధర్మరాజుతో చెప్పినట్లు భవిష్యత్పురాణం ఉత్తర భాగంలో ఉంది. అలాంటి మహాత్ముని జీవిత విశేషాలను పరిశీలిద్దాం.

భూదేవికి భారం ఎవరు? : ఏ మహాత్ముని కీర్తిప్రతిష్ఠలైనా చరిత్రపుటల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్నాయంటే వారిలోని సత్యసంధత, త్యాగనిరతి, దానగుణం అనే సుగుణ పుష్పాల సౌరభాలే అందుకు కారణం. ఎవరి వ్యక్తిత్వమైతే ఈ సుగుణాలతో విరాజిల్లుతుందో వారు మాత్రమే చిరస్మరణీయులు అనడానికి హరిశ్చంద్ర చక్రవర్తి, శిబి చక్రవర్తి, బలి చక్రవర్తుల జీవితాలే ఉత్తమ నిదర్శనాలు.

వామనుని వలన బలి చక్రవర్తికి వాటిల్లబోయే ఆపదను గ్రహించిన శుక్రాచార్యుడు 'వామన రూపంలో వచ్చినవాడు సాక్షాత్తూ మహావిష్ణువు. అతడు విశ్వరూపం ధరించి ఒక అడుగుతో భూలోకాన్నీ, రెండో అడుగుతో స్వర్గలోకాన్నీ ఆక్రమిస్తాడు. మూడో అడుగు నీ వినాశనానికి దారితీస్తుంది' అని బలి చక్రవర్తిని వారించాడు. అప్పుడు బలి చక్రవర్తి **మేరువు దలక్రిందైనను, బారావారంబు లింక బాతిన లోలో ధారుణి రజమై పోయిన, దారాధ్వము బద్ధమైన దప్పక యిత్తున్... 'యెట్టి దుష్కర్ముని నే భరించెద గాని సత్యహీనుని మోవజాల' ననుచు బలుకదే తల్లి భూదేవి బ్రహ్మతోడ...** (పోతన భాగవతం)

"మేరు పర్వతం తలక్రిందులైనా, సముద్రాలు ఇంకిపోయినా, భూమండలం పొడియైనా, మిన్ను విరిగి మీద పడినా సరే ఆడిన మాట తప్పను. ఎలాంటి చెడు పనుల్ని చేసినవాడినైనా నేను మోయగలను కానీ అసత్యవాదిని భరించలేను" అని భూదేవి బ్రహ్మతో పలికిన మాటల్ని శుక్రాచార్యునికి గుర్తుచేశాడు. కాబట్టి మనం భూదేవికి భారం కాకుండా సత్యనిష్ఠులమై జీవించడానికి ప్రయత్నిద్దాం.

మోక్షసాధనకు మూడడుగులు: వామనమూర్తి బలి చక్రవర్తిని కేవలం మూడడుగుల నేల అడగడానికి కారణం ఏమిటని సందేహం వచ్చి పరీక్షిత్తు మహారాజు 'బలిని అంభోరుహనేత్రుడేమి కొరకై పాదత్రయిన్ వేడె?' అని శుక మహర్షిని అడిగాడు.

స్థిరసుఖాసనంలో కూర్చొని జపధ్యాన సాధనలు చేయడానికి మనిషికి కావలసింది మూడడుగుల నేల మాత్రమే. కాబట్టి సాధకుడు మూడడుగుల నేలను సంపాదించి జపధ్యాన సాధనల్ని చేస్తే మోక్షాన్ని పొందవచ్చునని గుర్తుచేయడమే మూడడుగులలోని విశేషం.

పరమపదానికి చేర్చే త్రిగుణాతీతస్థితి: మానవుల స్వభావం సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలతో ముడిపడి ఉంది. మనిషి పరమోన్నత స్థితిని పొందాలంటే త్రిగుణాలకు అతీతుడు కావాలి. శ్రీరామకృష్ణ పరమహంస ఈ మూడు గుణాల్నీ ముగ్గురు దొంగలతో పోల్చి చెప్పే కథను ఒకసారి గుర్తుచేసుకుందాం:

(అక్టోబర్ 17, శనివారం - దీపావళి పర్వదినం)

ఒక ధనికుడు అడవి(సంసారం) మార్గంలో నడుచుకుంటూ వెళుతున్నాడు. హఠాత్తుగా ముగ్గురు దొంగలు (మూడు గుణాలు) వచ్చి అతని దగ్గర ఉన్న ధనాన్ని దోచుకున్నారు. ఇతణ్ణి ప్రాణాలతో విడిచిపెడితే ప్రమాదం అని తలచిన ఒక దొంగ (తమోగుణం) ధనికుణ్ణి చంపడానికి సిద్ధమయ్యాడు. అంతలో రెండో దొంగ(రజోగుణం) అడ్డుపడి, 'ఇతణ్ణి చంపకుండా కాళ్ళూచేతులూ కట్టి వదిలేద్దాం' అన్నాడు. అందుకు ఆ ముగ్గురు దొంగలూ అంగీకరించి ఆ ధనికుణ్ణి తాళ్ళతో బంధించి వెళ్ళిపోయారు. కొంతదూరం వెళ్ళాక మూడో దొంగ (సత్త్వగుణం) వెనుకకు తిరిగి వచ్చి, అతడి కట్లు విప్పాడు. తనతోపాటే కొంతదూరం తీసుకువెళ్ళి, ధనికుని ఊరికి దారి చూపించాడు. అప్పుడు ఆ ధనికుడు మూడో దొంగ చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలుపుతూ 'అయ్యా! మీరు నాకు ఎంతో సహాయం చేశారు. దయచేసి మీరు నాతో పాటు మా ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించండి' అని ఆహ్వానించాడు. అందుకు మూడో దొంగ 'అక్కడకు వస్తే రక్షకభటులు నన్ను పట్టుకుంటారు' అని చెప్పి వెనక్కి వెళ్ళిపోయాడు. సత్త్వగుణం మోక్షానికి మార్గం చూపిస్తుంది కానీ మోక్షపదాన్ని చేర్చలేదు. కాబట్టి మనిషి త్రిగుణాలకు అతీతుడైనప్పుడే మోక్షానికి అర్హుడవుతాడు.

బలి చక్రవర్తి ఈ మూడు గుణాలకు అతీతుడై మోక్షపదాన్ని పొందిన తీరును చూద్దాం:

బలి చక్రవర్తి కొలువై ఉన్న నిండు సభలోనికి వామనుడు మెల్లమెల్లగా అడుగులు వేస్తూ ప్రవేశించినప్పుడు బలిచక్రవర్తి ఆ బాలుని దివ్యత్వాన్ని గుర్తించి, భక్తిప్రపత్తులతో వామనుని పాదాలను గంగాజలంతో కడిగి ఆ నీళ్ళను తన తలపై చల్లు కున్నాడు. తమోగుణ ప్రభావంలో ఉన్నవారు ఎదుటి వ్యక్తిలోని విశిష్టతను గుర్తించలేరు. కానీ వామనుణ్ణి చూడగానే ఇతడు సామాన్య బాలుడు కాదని బలిచక్రవర్తి వెంటనే గ్రహించాడు.

రజోగుణం ఉన్న వారి మనస్సు కామక్రోధాలు, రాగద్వేషాలతో నిండి ఉంటుంది. అందువల్ల వారిలో నిత్యానిత్య వివేకం లోపిస్తుంది. కానీ బలి చక్రవర్తి వామనునికి దానం ఇవ్వకుండా శుక్రాచార్యుడు అడ్డుపడినప్పుడు

కారే రాజులు? రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిం బొందరే?
వారేరీ సిరి మూట గట్టుకొని పోవం జాలిరే?.. (పోతన భాగవతం)

'ఆచార్యా! పూర్వం రాజులు ఎంతోమంది రాజ్యాలను పరిపాలించారు. వారెవ్వరూ ఈ సంపదల్ని మూటకట్టుకొని పోలేదు కదా!' అని ఈ ప్రపంచంలో అనిత్యమైన సంపదల కోసం తాపత్రయం ఎందుకని తన విచక్షణా జ్ఞానాన్ని ప్రదర్శించాడు బలి చక్రవర్తి. దీన్నిబట్టి బలి చక్రవర్తి రజోగుణానికి అతీతుడైనాడని మనకు అర్థమవుతుంది.

శ్రీరామకృష్ణులు చెప్పిన కథలోని ధనికునికి దారి చూపించిన మూడో దొంగ సత్త్వగుణం. ధనికుడు తన ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించమన్నప్పుడు రక్షకభటులు తనను బంధిస్తారని చెప్పి తప్పించుకున్నాడు మూడో దొంగ. బలి చక్రవర్తి వామనునికి దానం ఇవ్వడం వల్ల తనకు మరణం తప్పదని తెలిసినా, తనను విష్ణువు బంధిస్తాడని తెలిసినా భయపడకుండా 'బంధించిన వాడే బంధవిముక్తుణ్ణి చేస్తాడు' అని సంపూర్ణ శరణాగతి భావాన్ని ప్రదర్శించి 'నేను' అనే మమకారానికి అతీతుడయ్యాడు.

ఎవరైతే త్రిగుణాలకూ అతీతులవుతారో వారు మోక్షానికి అర్హులని భగవద్గీతలో శ్రీకృష్ణుడు బోధించాడు.

గుణానేతానతీత్య త్రీన్ దేహీ దేహసముద్భవాన్ ।
జన్మమృత్యుజరాదుఃఖైర్విముక్తోఽమృతమశ్నుతే॥ (గీత- 14.20)

'మానవ జన్మకు కారణాలైన ఈ మూడు గుణాలనూ అతిక్రమించినవాడు జనన, మరణ, వ్యాధుల వల్ల కలిగే దుఃఖాల నుండి విముక్తుడై మోక్షం పొందుతాడు'.

బలిచక్రవర్తి త్రిగుణాలకు అతీతుడవడం వలన త్రివిక్రముడు అతనికి సుఖదుఃఖాలకు అతీతమైన సుతల లోకాన్ని ప్రసాదించాడు. అక్కడ సర్వదా సుదర్శన చక్రం రక్షిస్తుందని అభయమిచ్చాడు.

'సుతలం' అంటే ఉన్నతమైన ప్రదేశం. 'సుదర్శనం' అంటే మంచి దర్శనం. ఉత్కృష్టమైన ప్రదేశంలో సదా భగవంతుణ్ణి దర్శిస్తూ ఆనందాన్ని అనుభవించవచ్చని దాని అర్థం. మనకూ అలాంటి సౌభాగ్యాన్ని ప్రసాదించాల్సిందిగా ఆ త్రివిక్రముణ్ణి ప్రార్థిద్దాం. ❖

మొండితనం పట్టుదల

– స్వామి సుప్రియానంద

"మా అబ్బాయి మొండి. మాటవినడు. ఈ మొండి తనమెలాపోతుంది?"... ఇది చాలా మంది తల్లితండ్రుల సమస్య. అసలు జీవితంలో ఏదో ఒక సమయంలో ఎవరైనా మొండితనం లేకుండా ఉండగలరా? అంటే అందరూ ఎప్పుడో ఒకప్పుడు మొండివాళ్ళే!

"అనంతశక్తి మనలోనే దాగి ఉంది" అంటారు స్వామి వివేకానంద. సాధారణంగా 'శక్తి' అనగానే మనం 'బలప్రయోగం' అనుకుంటాం. మనలో అంతర్వాహినిలా సంచరించే అనేక శక్తుల గురించి తెలుసుకోవడానికి మనం ప్రయత్నించం. మనలో ముఖ్యంగా మూడు శక్తులున్నాయి. అవి: ఇచ్ఛాశక్తి (desiring), జ్ఞానశక్తి (knowing), క్రియాశక్తి (doing).

ఒకరు మొండిగా వ్యవహరించినప్పుడు వారిలోని ఇచ్ఛాశక్తియే దానికి కారణం. ఈ ఇచ్ఛాశక్తి లేకుండా మనం జీవించలేం. అలాగే మొండితనంతో మనమేమీ సాధించలేం. ఇచ్ఛాశక్తిని జ్ఞానశక్తితో మేళవించినప్పుడు మొండితనం పట్టుదలగా మారుతుంది. ఆ పట్టుదలకు క్రియాశక్తిని జోడించినప్పుడు కార్యదక్షత పొందగలుగుతాం.

ప్రతి మనిషీ తనలో పట్టుదలను పెంపొందించు కోవాలనుకుంటాడు. మొండితనంలో స్వార్థం, రాగద్వేషాలు ఉంటాయి. అవిలేకుండా ఉండేదే 'పట్టుదల'. ఉన్నత మార్గంలో నడిపించేదే పట్టుదల. ప్రహ్లాదుడిలో అతని తండ్రికి మొండితనం మాత్రమే కనిపించింది. కానీ మనకు రాగద్వేషాలు ఇసుమంతైనా లేని ప్రేమ, భగవద్భక్తితో నిండిన పట్టుదల ప్రహ్లాదుడిలో కనబడతాయి. చాలా మంది హరిశ్చంద్రుడు మొండివాడు, అనవసరంగా కష్టాలు కొని తెచ్చుకున్న పిచ్చివాడు అనుకోవచ్చు. కానీ ఆయనలోని సత్యనిష్ఠ అనే 'పట్టుదల' గాంధీజీని ఎలా ప్రభావితం చేసిందో మనకు తెలుసు. ఈ ఆధునిక కాలంలో గాంధీజీని కూడా 'మొండివాడు' అనే వాళ్ళున్నారు. కానీ అది మొండితనమా? పట్టుదలా??

గాంధీజీ రౌండు టేబుల్ సమావేశానికి వెళ్ళినప్పుడు జరిగిన సంఘటన: బ్రిటీష్ రాణి ఎలిజబెత్ –II గాంధీజీని విందుకు ఆహ్వానించింది. గాంధీజీ "ప్రతిరోజూ నా భోజనం సాయంత్రం 7 గంటలకు చేస్తాను. మీ విందు రాత్రి 10 గంటలకు కాబట్టి నేను రాలేను" అని అన్నారు. దానికి బ్రిటీష్ రాణి "ఆ రోజు విందు 7 గంటలకే ఏర్పాటు చేస్తాం"అన్నారు. దానికి గాంధీజీ "మీరు మాంసం, మద్యం సేవిస్తారు, నాకు రెండూ సరిపడవు క్షమించండి. నేను రాలేను" అని బదులిచ్చారు. అందుకు రాణి "విందులో శాఖాహార భోజనమే అందరికీ పెడతాం. మద్యం నిషేధిస్తాం. కాబట్టి తప్పక రాగలరు" అని వర్తమానం పంపారు.

మళ్ళీ గాంధీజీ "రాత్రి భోజనానికి ముందు "రఘుపతి రాఘవ రాజారాం" భజన చేయకుండా ముద్ద ముట్టను. అది మీ విందులో సాధ్యం కాదు కదా!" అన్నారు. అప్పుడు మీ భజన కార్యక్రమానికి మాకెటువంటి అభ్యంతరంలేదని ఆమె చెప్పడంతో, గాంధీజీకి ఒప్పుకోక తప్పలేదు.

దీని ద్వారా గాంధీజీ తన నియమబద్ధ జీవనం కోసం కనబరిచిన 'పట్టుదల' మనకు గోచరిస్తుంది. అంతేకాదు బ్రిటీష్ రాణిలో కూడా గాంధీజీని ఎలాగైనా విందుకు రప్పించాలనే 'పట్టుదల' మనకు కనబడుతుంది. కాబట్టి మొండితనంలో లేని ప్రేమ పట్టుదలలో వ్యక్తమవుతుంది. కాబట్టి మనం మొండితనాన్ని వ్యతిరేకించడం కాదు, దానికి 'ఊర్ధ్వగతి'ని (upwardturn) ఇవ్వడానికి ప్రయత్నించాలి. ❖

భగవన్నామం ఓ దివ్య ఔషధం

– స్వామి జ్ఞానదానంద

దివ్యనామం గురించి శ్రీరామకృష్ణుల ఉపదేశాన్ని అక్షయ్ సేన్ ఇలా వ్రాశాడు: “ఒక దుష్ట పిశాచం ఆవహించినట్లు, మనిషి మనస్సును అపవిత్ర ఆలోచనలు ఆక్రమించుకొని ఉంటాయి. మనస్సును పవిత్రీకరించడం కోసం విశ్వాసంతో నిరంతరాయంగా భగవన్నామాన్ని జపించాలి. ఇదే అతి సులభమైన మార్గం. శ్రీరామకృష్ణులు పదే పదే ఇలా చెప్పేవారు: ‘భగవన్నామంలో అనంతమైన మహిమ ఉంది. నామమే బీజం; నామమే చెట్టు; నామమే పండు. భగవంతుడు తన నామంలోనే నెలకొని ఉంటాడు’. మౌఖిక ఉపదేశాన్ని జనులు అంతగా లక్షించరు. కనుక భగవన్నామ దివ్యౌషధ మహిమను జనులకు తెలియజేయడానికి శ్రీరామకృష్ణులు భగవన్నామాన్ని ఉచ్చరిస్తూ, చప్పట్లు చరుస్తూ నృత్యం చేసేవారు. భగవన్నామ పునరుచ్చరణ ఆయనను సమాధి స్థితికి తీసుకుపోయేటంతగా ఉన్మత్తులయ్యే వారంటే అతిశయోక్తి కాదు. అనేక జన్మల పాటు తీవ్రసాధనలు అనుష్ఠించడం ద్వారా ఒక వ్యక్తి సమాధి స్థితిని సంతరించుకోవచ్చు. అదే సమాధి స్థితిని భగవన్నామ పునశ్చరణ వల్లా సంతరించుకోగలమని శ్రీరామకృష్ణులు ఋజువు చేశారు. ‘నారద భక్తి (భగవన్నామ జపం, భగవన్నామ గానం, భగవన్నామ శ్రవణం) కలియుగంలో భగవత్సాక్షాత్కారానికి ఉత్కృష్టమైన సాధన’ అని శ్రీరామకృష్ణులు వచించారు.

బిగ్గరగా వినిపిస్తున్న సంగీత ధ్వనిలో ఇద్దరు వ్యక్తుల సంభాషణ వినపడదు. అలాగే బిగ్గరగా గానం చేస్తున్న సంకీర్తనలో లౌకికమైన కోర్కెలు అణగారిపోతాయి. దివ్యనామం కామాన్ని దిగమింగుతుందని చెబుతారు. శ్రీరామకృష్ణులు తమ శిష్యుడైన యోగానందను కామానికి విరుగుడుగా భగవన్నామాన్ని పునరుచ్చరించమన్నారు.

శ్రీరామకృష్ణులు *“జయ గోవింద, జయ గోపాల”; “కేశవ మాధవ దీనదయాళ్”; “హరే మురారే గోవింద, వసుదేవకి నందన గోవింద”; “హరే నారాయణ గోవింద హే”, “హరే కృష్ణ వాసుదేవ”* అని స్మరిస్తూ నృత్యం చేసేవారని రామ్‌లాల్ చెప్పాడు.

“సాయంత్రం బాగా ప్రొద్దుపోయాక గురుదేవులు ‘బ్రహ్మం మాయ – జీవ – జగత్’ మంత్రాన్ని పునశ్చరణ చేసేవారు. ఈ మంత్ర స్మరణ చేత భగవత్సాక్షాత్కారాన్ని పొందవచ్చు. ‘ఇదొక నిగూఢమైన మంత్రం’ అని గురుదేవులు చెప్పారు” అని ‘మ’ చెప్పేవారు.

శ్రీరామకృష్ణులు బలరామ్ ఇంటిని గానీ, ఇతర భక్తుల ఇళ్ళను గానీ పావనం చేసినప్పుడు భగవన్నామాన్ని స్మరించేవారు. ఆయనను దర్శించుకొన్న భక్తులంతా “జగజ్జనని నామాన్ని ఈ పరమహంసగారు ఎంత చక్కగా పునరుచ్చరిస్తున్నారు. అది హృదయాలలోకి చొచ్చుకుపోతోంది” అని అనేవారు.

శ్రీరామకృష్ణులు ఏకరీతి జీవితాన్ని ఎన్నడూ కోరుకోలేదు. భగవంతునికి అనేక నామాలు ఉన్నాయని వ్యక్తిగత అనుభవాల ద్వారా ఆయన గ్రహించారు. ఒకరోజు దక్షిణేశ్వరంలో గురుదేవులు “గౌర్, గౌర్” (చైతన్యుల పేర్లలో ఒకటి) అంటూ పునశ్చరణ చేస్తున్నారు. అప్పుడు ఎవరో ఇలా అడిగారు: “మహాశయా! మీరు జగజ్జనని నామాన్ని పునశ్చరణ చేస్తారు కదా! ఎందుకు ఇప్పుడు గౌర్ నామాన్ని స్మరిస్తున్నారు?” అందుకు గురుదేవుల జవాబు: “ఏం చెయ్యను? మీకు భార్య, కొడుకు, కూతురు, డబ్బు ఉన్నాయి. కానీ నాకు ఉన్నది ఆ భగవంతుడు ఒక్కడే. కనుక నేను కొన్ని సమయాల్లో గౌర్, కొన్ని సందర్భాలలో అమ్మ, మరికొన్ని సమయాల్లో రామ, కృష్ణ, కాళీ లేక శివ అంటూ స్మరిస్తాను. ఈ రీతిలో కాలం గడుపుతాను”.

ప్రాపంచికత అనే రుగ్మతకు భగవన్నామమే ఓ దివ్య ఔషధం. కాబట్టి భగవన్నామ స్మరణతో మన జీవితాలను పునీతం చేసుకొందాం. ❖

భక్తునిలో విశ్వాసాన్ని పెంచిన భగవంతుడు

శ్రీరామకృష్ణుల ఇంద్రజాలస్పర్శ సుబోధ్‌లో నిద్రాణమై ఉన్న ఆధ్యాత్మికతను మేల్కొల్పింది. ధ్యానం చేయడం మొదలుపెట్టగానే, శరీరమంతా కంపించి, ఒక ప్రవాహం తన వెన్నెముక ద్వారా వేగంగా ప్రవహించి మెదడుకు చేరుతున్న భావన అతడికి కలిగింది. అనిర్వచనీయ ఆనందం అతణ్ణి ముంచి వేసింది. తనలో ఒక వింతకాంతినీ, అందులో వివిధ దేవదేవీ స్వరూపాలు మెరుస్తూ ఉండడాన్నీ గాంచాడు. అతడి ధ్యానం గాఢమై, శరీర స్పృహనూ, బాహ్య చైతన్యాన్నీ కోల్పోయాడు. అతడు తిరిగి చైతన్యం పొందేసరికి గురుదేవులు తన శరీరాన్ని తల నుండి క్రిందకు నిమురుతూ కనిపించారు. ఆయన, "నువ్వు ఇంటివద్ద ధ్యానం చేసేవాడివా?" అని ప్రశ్నించారు. ఆ కుర్రవాడు, "చాలా కొద్దిగానండీ! మా అమ్మ చెప్పిన దేవుళ్ళు, దేవతల గురించి కొద్దిగా ఆలోచించేవాడిని" అన్నాడు. "ఆహా! అందుచేతనే అంత సులభంగా ఏకాగ్రతను పొందగలిగావు" అని గురుదేవులు అన్నారు.

ఆయన సుబోధ్‌తో జపం, ధ్యానం, బ్రహ్మచర్యాలను గురించి మాట్లాడేవారు. అతడి భక్తి విశ్వాసాలను పరీక్షించే వారు. ఒకసారి గురుదేవులు, సుబోధ్ శరీరాన్ని తాకి అతడితో "ఈ రోజున నీ మనస్సు నుండి కామాన్ని తొలగించాను" అని చెప్పారు.

సుబోధ్ మొదట్లో గురుదేవులు భగవదవతారమని అంగీకరించలేదు. ఒకరోజు గురుదేవులు అతణ్ణి, "నా గురించి నువ్వేమనుకుంటున్నావు?" అని అడిగారు. "జనం మీ గురించి రకరకాల విషయాలు చెప్పారు. అయితే స్పష్టమైన ఋజువు కనబడితే తప్ప నేను అవి ఏవీ నమ్మను" అని సుబోధ్ అన్నాడు. అహంకార రహితులైన గురుదేవులు ఇది విని, "మంచిది. పాత నాణాలకు క్రొత్త నాణాలనిచ్చేవాడు నాణాన్ని పరీక్షించిన విధంగానే, నన్ను పరీక్షించాకే అంగీకరించు" అన్నారు.



స్వామి సుబోధానంద

సుబోధానంద స్వామిగా పేరొందిన సుబోధ్ చాలా సంవత్సరాల తరువాత శ్రీరామకృష్ణులు, శ్రీ శారదామాతల గురించి ఒక ఉత్తరంలో, "వారంతట వారు తమను తెలియబరచుకోనిదే వారిని గుర్తించడం ఎవరికి సాధ్యం?" అని వ్రాశారు. గురుదేవులతో సుబోధ్ సన్నిహితమయ్యే కొద్దీ శ్రీరామకృష్ణుల దైవత్వం పట్ల అతడికున్న విశ్వాసం క్రమంగా బలపడింది. ఒకరోజు గురుదేవులు, సుబోధ్‌తో ధ్యానం చెయ్యమని చెప్పారు. అతడు, "అయ్యా! నేను ధ్యానం అభ్యసించ వలసి ఉంటే, మీ వద్దకు ఎందుకు రావాలి? వేరే గురువు వద్దకు వెళ్ళవచ్చు కదా!" అని జవాబిచ్చాడు. అతడి మనోగతాన్ని అర్థం చేసుకొన్న గురుదేవులు, "సరే! నువ్వు ధ్యానం చేయనవసరం లేదు. కానీ ఉదయం, సాయంత్రం నా గురించి ఆలోచించు" అన్నారు.

శ్రీరామకృష్ణులు తన ఆధ్యాత్మిక జీవనయాత్రలో ఎదుర్కొన్న కష్టాలను గురించి సుబోధ్‌తో ఇలా చెప్పారు: "నా సాధనల కాలంలో నేను దైవోన్మత్త స్థితిలో ఉండేవాణ్ణి. ఒకరోజు దక్షిణేశ్వరంలోని పంచవటిలో కూర్చొని గడ్డి ఏరుతున్నాను. నా దృష్టిని ఆకర్షించడానికి ప్రయత్నిస్తూ ఒక అందమైన యువతి వచ్చి నా వెనుక నిలబడింది. నాకు ఆమె ఉనికే తెలియలేదు. చాలాసేపు వేచి ఉన్న తరువాత, ఆమె నువ్వు అద్భుతమైన వైరాగ్యం కలిగిన సన్న్యాసివి. నువ్వు నా వైపు ఒక్కసారి కూడా చూడలేదు" అంది.

ఈ సంఘటన విన్న సుబోధ్ గురుదేవుల పట్ల సంపూర్ణ భక్తివిశ్వాసాలను పెంపొందించుకొని తన ఆధ్యాత్మిక జీవితాన్ని కొనసాగించాడు. ❖

(అక్టోబర్ 30, శుక్రవారం – శ్రీరామకృష్ణ పరమహంస సన్న్యాస శిష్యులైన స్వామి సుబోధానంద జయంతి)

పరమేశ్వరుని పరిరక్షణలో ...

స్వామి జపానంద స్వీయ అనుభవాలు -28

మహరాజ్ మాటతో మారిన మనిషి

కలకత్తా నగరంలో ఒక వీధిలో ఆరడుగుల పొడవుగల, సన్నగా ఉండే ఒక వ్యక్తి ఉండేవాడు. కుస్తీలు పట్టడం, అటూ ఇటూ తిరగడం తప్ప ఏ పనీ చేసేవాడు కాదు. తాత తండ్రులు ఇచ్చిన ఇల్లు ఒకటి ఉండేది. దానికి వచ్చే అద్దెతో ఇల్లు గడిచేది. రోజంతా జూదం, పేక ఆడడంలోనూ, గూండాగిరీతోనూ గడిచేది. వివాహం కాలేదు. ముసలి తల్లి ఉంది. పెద్దగా బాధ్యతలు లేవు. మాటిమాటికీ కోపం తెచ్చుకుని ఎదుటివారిని కొట్టేవాడు. ఎన్నిమార్లో జైలుకి వెళ్ళాడు. ఏదో రకంగా ప్రతీసారీ బయటికి వచ్చేవాడు. జైలు నుంచి విడుదల అయ్యాక అతణ్ణి జైలుకు పంపినవాడి పని పట్టేవాడు.

ఒకసారి ఆ వీధిలో కాళీపూజ జరుగుతోంది. పూజ నిర్వహిస్తున్న వారిలో చాలా మందికి స్వామీజీతో పరిచయం ఉంది. కాళీపూజ సందర్భంలో నారాయణసేవ (అంటే బీద వాళ్ళకు భోజనాలు పెట్టే ఏర్పాటు) కూడా జరుగుతోంది. ఆ పూజకు స్వామి జపానందజీని కూడా ఆహ్వానించారు. స్వామి సమయానికి అక్కడకు చేరుకున్నారు. కాళీపూజ రాత్రి అంతా జరుగుతుంది. నిర్వాహకులలో ఒక పెద్దమనిషి వచ్చి జపానందజీతో "చూడండి, ఎదురుగా నిల్చొని ఉన్న పొడుగు మనిషి నుంచి కాళీమాత అందరినీ రక్షించాలి. అతను మాటిమాటికీ అందరితోనూ గొడవ పెట్టుకుంటాడు. అందరూ అతనంటే భయపడతారు. రాత్రంతా పూజ జరుగుతుంది కదా! యువకులు సరదాగా గడుపుతారు. ఎవరైనా అతనితో గొడవ పడితే అంతే! వాళ్ళ పని అయిపోయినట్లే" అన్నాడు.

స్వామి ఇదంతా విని భయపడ్డారు. 'అలా జరిగితే అందరికీ ఇబ్బంది కలుగుతుంది కదా!' అని కొంచెం ఆలోచించి అతణ్ణి పిలిచి మంచి మాటలతో ఇలా నచ్చచెప్పారు: "పూజా కార్యక్రమంలో ఏ విధమైన ఇబ్బందీ రాకుండా మీరు జాగ్రత్త తీసుకోండి. చాలామంది యువకులు ఉన్నారు. ఎక్కడైనా, ఏదైనా గొడవ జరిగితే వాళ్ళకు మీరు సర్ది చెప్పండి. మీరు అందరికీ తెలుసు. మీరు పూచీ వహిస్తే కార్యక్రమం ప్రశాంతంగా పరిసమాప్త మవుతుంది". స్వామి మాటలతో అతనికి విషయం తెలిసిపోయింది. సన్న్యాసి ఆ పని తనకే ఎందుకు అప్పచెబుతున్నారో అర్థమైంది. చిరునవ్వు నవ్వుతూ "మీరు నిశ్చింతగా ఉండండి. నా వల్ల ఎవరికీ ఏ విధమైన ఇబ్బందీ కలగదు" అన్నాడు. అతను మాట ఇచ్చాడంటే ఆ మాటకు కట్టుబడి ఉంటాడని అందరికీ తెలుసు. ఉదయం పూజ అయిపోయాక ప్రసాదం తీసుకుని అందరూ వెళ్ళిపోయారు. రాత్రి ఆ పొడవు వ్యక్తి ఎక్కడికో వెళ్ళి వచ్చాడు. కార్యక్రమం అంతా బాగా జరిగిపోయింది.

మర్నాడు పోలీసులు ఆ పొడుగాటి వ్యక్తిని వెతుక్కుంటూ వచ్చారు. ఎందుకని ఎవరో అడిగితే, రాత్రి అతను ఒక వ్యక్తి చెవి కోసేశాడని చెప్పారు. "నిన్న పగలంతా అతను ప్రశాంతంగా ఇక్కడే ఉన్నాడు. మధ్యలో ఒక్కసారి మాత్రం ఎక్కడికో వెళ్ళి వచ్చాడు. ఏం చేశాడో? ఎక్కడికి వెళ్ళాడో?" అని ఎవరో చెప్పారు. సాయంత్రం ఆ పొడుగాటి వ్యక్తి అక్కడికి వచ్చాడు. "మీరు వెళ్ళిపోయిన తరువాత మీ కోసం పోలీసులు వచ్చారు. ఎవరిదో చెవి కోశారట. నిజమేనా?" అని స్వామి జపానంద అన్నారు. "అవును మహరాజ్! నిజమే. రాత్రి నేను మా ఇంటికి వెళ్ళాను. అటు నుంచి ఒక బలిష్ఠమైన వ్యక్తి మా వీధిలో కనపడితే అతను

ఎవరో, ఎందుకు మా వీధిలో తిరుగుతున్నాడోనని అడిగితే 'నా ఇష్టం! నేను నాకు కావలసిన వీధిలో తిరుగుతాను' అన్నాడు. అతని మాటలు విని, నాకు కోపం వచ్చింది. అతని చెవి కోసేశాను. ఇలాంటి గొడవలు నాకు చాలామందితో అయ్యాయి. పోలీసులకు తెలుసు. నాలుగు రోజులు నన్ను వెతుకుతారంతే" అన్నాడు.

ఈ మనిషితో ఈ విషయం గురించి ఏమీ మాట్లాడకుండా వేరే విషయాలు మాట్లాడడం మంచిది అని అనుకుని "అయ్యా! మీరు ఏదైనా ఉద్యోగం కానీ, వ్యాపారం గానీ చెయ్యరా?" అని అడిగారు. ఆ వ్యక్తి, "లేదు. మా తాతలు, తండ్రి ఇచ్చిన ఒక

ఇల్లు ఉంది. దానికి అద్దె వస్తుంది. నేను, నా తల్లి ఇద్దరమే ఉంటాం. అలా వచ్చిన దానితో మా జీవితం గడిచిపోతుంది” అన్నాడు. “అంటే మీకు ఎలా కావాలంటే అలా మీ సమయం గడుపుతారన్నమాట. చూడండి! మీ వీధిలో చాలామంది బీదవాళ్ళు ఉన్నారు. వాళ్ళు చాలా కష్టపడి సంపాదించుకుని బతుకుతున్నారు. అనారోగ్యం వస్తే చాలా ఇబ్బంది పడిపోతారు. చికిత్స కోసం వైద్యుడి దగ్గరకు వెళితే చాలా సమయం నిరీక్షించవలసి ఉంటుంది. పైగా వైద్యులు వాళ్ళను సరిగ్గా చూడరు. బీదవాళ్ళ మీద చిన్న చూపు. పూర్వం మన దేశంలో బీద ఇంట్లో పుట్టడం ఒక పాపం అనుకునే వారు కాదు. కానీ విదేశీ సంప్రదాయం వచ్చాక బీదరికం కూడా ఒక తప్పు కిందే పరిగణింపబడుతోంది. అందువల్ల మీరు రోగులకూ, అసహాయులైన వాళ్ళకూ కొంచెం సాయం చేస్తూ ఉండండి. వాళ్ళ పట్ల మీరు సహానుభూతి చూపిస్తే, వాళ్ళు మీ మేలు మర్చిపోరు. సదా మీరంటే కృతజ్ఞులై ఉంటారు. మిమ్మల్ని దైవంగా భావిస్తారు. దాని కోసం మీరేమీ ఖర్చు పెట్టనక్కరలేదు. స్వామి వివేకానంద 'మానవసేవే మాధవ సేవ' అని చెప్పారు. అందుకని మీ దగ్గరకు వచ్చిన పేదవారికి సేవ చేస్తే చాలా బాగుంటుంది. మీలో సమర్థత ఉంది. ఆ వైపు మీ దృష్టి సారిస్తే అందరికీ మంచి జరుగుతుంది” అని చెప్పారు.

అంతా విన్న ఆ వ్యక్తి, “అవును. ఈ పని నేను చాలా సులువుగా చెయ్యగలను. మా వీధిలోనే వైద్యుడు ఉన్నాడు. అతని దగ్గరకు నేను అవసరం ఉన్నవాళ్ళను తీసుకెళ్ళగలను. ఇవాల్టి నుంచి నేను ఈ పని చేస్తానని మీకు మాట ఇస్తున్నాను. ఈనాటి వరకూ ఈ విషయాలు నాకు ఎవరూ చెప్పలేదు. నేను ఇప్పుడు ఏం చెయ్యాలో నాకు బాగా అర్థమైంది” అన్నాడు.

అందుకు సన్న్యాసి, “మంచిది. ఈ పని మీరు బాగా చేస్తారని నాకు నమ్మకం ఉంది. ఉదయం, సాయంకాలం మీరు వీధిలో అటూ ఇటూ తిరుగుతారు కదా అందరినీ చూసుకోండి. అవసరమైన సహాయం చెయ్యండి. మిమ్మల్ని చూసి మిగతావాళ్ళు కూడా నేర్చుకుంటారు” అన్నారు. ఆ వ్యక్తి అంతా విని, “అలాగే! నేను సంతోషంగా ఈ పని చేస్తాను. మా వీధిలో అందరూ నన్ను ఎరుగుదురు. వారికి సేవ చేయడం నాకు సమ్మతమే” అన్నాడు.

చాలా కాలం తరువాత స్వామి జపానంద మళ్ళీ ఆ వీధికి వెళ్ళారు. అక్కడ ఆయన పరిచితులు “స్వామీజీ! ఆ మోసగాడు ఇప్పుడు బస్తీవాళ్ళందరికీ దేవుడి లాంటి వాడయ్యాడు. ఎవరైనా అనారోగ్యంతో బాధ పడుతున్నారని తెలియగానే అర్ధరాత్రి అయినా సరే వైద్యుణ్ణి పిలిచి, రోగికి చికిత్స జరిగే ఏర్పాటు చేస్తున్నాడు. వైద్యుడు కూడా డబ్బు కోసం ఆలోచించకుండా పిలవగానే వెంటనే వెళుతున్నాడు. అతని వల్ల పేదవాళ్ళందరికీ మంచి జరుగుతోంది. ఎవరైనా చనిపోతే వారికి అంతిమ సంస్కారం చేసే ఏర్పాట్లు కూడా అతనే చేస్తున్నాడు” అని చెప్పారు.

స్వామీజీ వచ్చారన్న వార్త వినగానే అతను సంతోషంగా వచ్చి నమస్కారం చేసి, వినమ్రంగా కూర్చున్నాడు. స్వామీజీ అతణ్ణి ఆశీర్వదించి, “అన్ని సంగతులూ విన్నాను. నాకు ఇవాళ చాలా ఆనందంగా ఉంది. మీరు చాలా మంచివారు” అన్నారు. ఆ వ్యక్తి వినయంగా, “మీరే నాకు మానవత్వం” అంటే ఏమిటో చెప్పారు. నేను మీ ఋణం ఎప్పటికీ తీర్చుకోలేను. ఈ విధంగా జీవించడంలో ఆనందం ఉంది. పరుల సేవలో తరించేలా నన్ను ఆశీర్వదించండి” అన్నాడు. ❖ అనువాదం: **శ్రీమతి జి.ఎస్. లక్ష్మి**

భువిపై వెలసిన భవతారిణి

ముఖచిత్ర కథనం :

రాణి రాస్మణి కాశీవిశ్వనాథుణ్ణి దర్శించాలని 1847లో కాశీ యాత్రకు సిద్ధమైంది. ఇక మరుసటి రోజు బయలు దేరవలసి ఉందనగా ముందురోజు రాత్రి కాళీమాత ఆమెకు కలలో దర్శనమిచ్చి “కాశీకి పోనవసరం లేదు. భాగీరథీ తీరాన ఒక చక్కని ప్రదేశంలో నా శిలావిగ్రహాన్ని ప్రతిష్ఠించి, పూజతో పాటు అన్న నైవేద్యాలను ఏర్పాటు చెయ్యి, అదే చాలు. నే నా విగ్రహంలో అభివ్యక్తమై నిత్యం నీ సేవాదులు స్వీకరిస్తాను”అని ఆదేశించింది. దాంతో ఆమె పరమానంద భరితురాలై వెంటనే కాశీయాత్ర మానుకొని దేవీ ఆలయ నిర్మాణానికి సంకల్పించింది.

ఈ విధంగా జగజ్జనని మీద ఎంతో కాలం నుంచి ఉన్న దైవభక్తి ఇప్పుడు ఆమెను గంగానదీ తీరంలో ఒక విశాలమైన స్థలం కొనుగోలుచేసి, పెద్దమొత్తంలో ధనం వెచ్చించి తొమ్మిది గోపురాలతో కూడిన పెద్ద ఆలయం, చిన్న దేవాలయాలు, అలాగే ఒక చక్కని పూలతోట నిర్మాణానికి ఉపక్రమింప చేసింది. 1855వ సంవత్సరం మే 31వ తేదీ గురువారం స్నానయాత్ర పండుగ దినాన ఆలయంలో జగన్మాత ప్రతిష్ఠాపనోత్సవం జరిగింది.

శ్రీరామకృష్ణులు ఉపాసించి, దర్శించి, సంభాషించిన జగన్మాత ఈ భువిపై నడయాడిన పరమపుణ్య క్షేత్రం కలకత్తాలోని దక్షిణేశ్వర భవతారిణీ కాళికాలయం.

ఈ దేవాలయంలో దీపావళి అమావాస్య రోజున రాత్రంతా 'కాళీపూజ' జరుగుతుంది. ఈ పూజా కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొంటారు. ❖

దేవీ వైభవం

ప్రవచనం: **శ్రీ సామవేదం షణ్ముఖశర్మ**   విలేఖనం: **శ్రీమతి ఎన్. శేషు**

(...గత సంచిక తరువాయి)

ప్రకృతి శక్తులకి నియామకులు దేవతలు. కనుక ప్రకృతి అంతా క్షేమంగా ఉండి జగతి చక్కగా నడపబడాలి అంటే దేవతలు పని చెయ్యాలి. దేవకార్యానికి అడ్డువచ్చేటటు వంటివి ఆసురీ శక్తులు. వీళ్ళ వల్ల లోకానికి క్షేమం కాదు. లోకరక్షకి అయిన జగదంబిక దేవకార్య సముద్యతా– అంటే లోక రక్షణమే దేవకార్యం. లోక రక్షణ కోసం అమ్మవారు వచ్చింది. అంతేకానీ దేవతలు అనే ఒక శక్తిని కాపాడడానికి కాదు. విష్ణుమూర్తిని దేవపక్షపాతి అంటాం. విష్ణువు – వైష్ణవి వీళ్ళిద్దరూ ఒకటే తత్త్వం. దైవీ శక్తుల్ని రక్షించి లోకాన్ని కాపాడడానికి వచ్చారు అమ్మవారు; భండాసుర సంహారం చెయ్యడానికి లలితగా వచ్చింది; అటు మహిషాసుర సంహారం చేసింది. మహిషాసుర సంహారం, శుంభనిశుంభుల సంహారంలో రెండు రహస్యాలున్నాయి.

మహిషాసుర మర్దనం చేసేటప్పుడు అమ్మవారిని దేవత లందరూ ఆశ్రయించారు. కానీ ఆ ఆశ్రయ విధానం వేరేగా ఉంటుంది. ఎలాగంటే వీళ్ళందరూ బ్రహ్మదేముడి దగ్గరకు వెళ్తే బ్రహ్మాది దేవతలందరూ శివుని వద్దకు వెళతారు. అప్పుడు శివునికి కోపం వచ్చి భృకుటి ముడిపడుతుంది. భృకుటి ముడిపడగానే ఆ పరమశివుడిలో ఉన్న చండమైన తేజస్సు బయటకి వచ్చిందట. శివునికి కోపం వచ్చిన వెంటనే పక్కనే ఉన్న విష్ణువుకి కోపం వచ్చింది. ఆయన కనుబొమల ముడిలోంచి ఒక తేజస్సు వచ్చి అక్కడున్న తేజస్సుతో కలిసింది. ఆ తరువాత బ్రహ్మగారి తేజస్సు. ఇలాగ దేవతలందరి తేజస్సు అక్కడ ఉన్న ఆ మహాతేజస్సులో కలిసి 18చేతుల మహాకారంగా ఆవిర్భవించిందట. అలాగ ఆవిర్భవించిన స్వరూపంలో జుట్టులో ఏ దేవత ఉన్నదో, కనుబొమలలో ఏ దేవత ఉన్నదో, లలాటంలో ఏ దేవత ఉన్నదో... (లలితా స్వరూపాన్ని వర్ణించేటప్పుడు ఏవి చెప్పుకున్నామో) అన్నీ వర్ణిస్తాడు వ్యాస దేముడు. ఇందులో అంతరార్థం ఏమిటంటే అందరూ తలొక శక్తీ ధారపోస్తే ఒక మహాశక్తి అయింది అని కాదు; ఏ మహాశక్తి నుంచి వీళ్ళందరూ అంశాలుగా తెచ్చుకుని చలామణీ అవుతున్నారో వాళ్ళ అంశ శక్తులన్నీ ఆ తల్లే అని తెలుసుకుని ఉపాసన చేశారు. భిన్న భిన్నాలలో అంతటా ఉన్న ఏకత్వశక్తి ఏదుందో అది అనే తత్త్వమే అక్కడ ప్రతిపాదన జరుగుతోంది. అలాగ సర్వదేవతామయమైన ఆకారం ఆవిర్భవించింది. అమ్మ ఎప్పుడు ఆవిర్భవించినా, ఏ రూపంలో వచ్చినా ఆవిడ సర్వదేవమయి అని తెలుస్తోంది. ఒక్క అమ్మకి కానీ మనం నమస్కరిస్తే సర్వ దేవతలకీ నమస్కరించినట్లే. ఇది మహిషాసుర మర్దన సమయంలో జరిగిన కథ.

శుంభ– నిశుంభ సంహారం రెండవకథ. అప్పుడు అందరూ గౌరీదేవిని ఆశ్రయించారు. శుంభనిశుంభ సంహారానికి వెళ్ళినపుడు మొదట అమ్మ ఏకగా కనపడి ఒక్క రూపంతో తిరుగుతోందట. అప్పుడు చండముండులనే అసురులు (శుంభనిశుంభుల బంట్లు) అమ్మ వారిని చూసి ఒక స్త్రీ రత్నాన్ని చూశాం అన్నారట. వాళ్ళు రాక్షసులైనా ప్రభుభక్తి పరాయణులు. 'సృష్టిలోని మంచి వస్తువులన్నీ మన దగ్గర ఉండాలి' అనుకోవడం రాక్షస ప్రవృత్తి. ఆక్రమణ బుద్ధి, అపహరించడం, హింసించడం– ఇది రాక్షస ప్రవృత్తి.

మన రాజుగారికి ఆమెని అప్పగిస్తే మనం ప్రభు భక్తిని రుజువు చేసుకున్న వాళ్ళమవుతాం అనుకుని "నువ్వు మా ప్రభువుల్ని చేపట్టు" అని జగదంబికని అడిగారు. ఆ తల్లి వచ్చిందే వాళ్ళ పని పట్టడానికి! ఆమె "మీరు చెప్పినది బాగుంది. కానీ నాకొక వ్రతం ఉన్నది; అదేమిటంటే యుద్ధంలో నన్నెవరు జయిస్తారో వారినే చేపడతాను అని. నేను ఆ మాటకి కట్టుబడిపోయాను. అందుకు ఎంత గొప్పవాడైనా మీ రాజు నాతో యుద్ధం చెయ్యవల్సిందే" అన్నది. చండముండులు వెళ్ళి ఈ మాట చెప్పగానే ఆయన హుంకరించి "ఎంత పొగరు ఆమెకు" అని ధూమ్రాక్షుడు అనే రాక్షసుణ్ణి అమ్మపైకి యుద్ధానికి పంపాడు. ఈ రాక్షసుల పేర్లన్నీ మనలో ఉన్న రజోగుణ, తమోగుణ ప్రవృత్తుల పేర్లు. పురాణాలన్నిటిలోనూ జంట రాక్షసులే. అవే రజోగుణ తమోగుణాలు. వాటిని సంహరించి సాత్వికమైన శుద్ధసత్త్వాన్ని

మనం అభివృద్ధి చేసుకుంటే అమ్మవారి రక్షణ లభిస్తుంది అని ఆంతర్యం. అదే రామాయణ, భారత భాగవతాదుల ప్రయోజనం. ఒక్కోసారి ఒక్కడే కనిపిస్తాడు. వాడిలోనే రెండు ప్రవృత్తులూ కలిసి పోతాయి. ఉదా: మహిషాసురుడు. మహిషం అంటే దున్నపోతు... పూర్ణ తమోగుణం. దానికితోడు అసుర జత అయింది, ఇది తీవ్ర రజోగుణం. ఈ రెండూ దెబ్బతింటే గాని అసలుది లభించదు. మనలోని రెండు ఆసురీప్రవృత్తులు సంహరింపబడితేనే జ్ఞానమో, భక్తో కనిపిస్తుంది. అందుకు మనం రామాయణం పారాయణ చెయ్యాలి. నిత్యం చండీసప్తశతి పారాయణ చెయ్యాలి. అలాగే

ఈ లోకంలో ఆసురీ ప్రవృత్తులు విజృంభించినప్పుడు అమ్మ వారిని ఆశ్రయిస్తే లోకంలో ఉన్న రజోగుణ తమోగుణాలని సంహరిస్తుంది. అందుకు మనలో ఉన్న మహిషాసుర ప్రవృత్తిని, బయట ఉన్న మహిషాసుర ప్రవృత్తిని కూడా సంహరింపచేయమని మనం అమ్మని పిలవాలి.

ధూమ్రాక్షుడు అంటే పొగ (చూరిన) కళ్ళవాడు అని అర్థం. అంటే వాడి కళ్ళలో తేజస్సు లేదు. పొగ ఉంది. (పేరులోనే తమోగుణం తెలుస్తున్నది ఇక్కడ) అతను వెళ్ళేటప్పటికి అమ్మవారు హిమపర్వత శిఖరం మీద శోభిస్తున్నారు. 'ఏకా' అంటే ఒక్కరే ఉన్నారు. (ఆ ఘట్టంలో వ్యాసదేవుడు మాటిమాటికీ ఏకా ఏకా అంటూ చూపిస్తారు. జాగ్రత్తగా చూస్తే బ్రహ్మవిద్య మంత్రాలు ఒక్కొక్క శ్లోకంలో కనిపిస్తాయి). ఆ తల్లిని చూసి ధూమ్రాక్షుడు యుద్ధానికి సిద్ధపడి దుముకబోతూ ఉంటే హుంకరించి ఎర్రగా చూసిందట అమ్మవారు. ఆవిడ హుంకారం చేత ధూమ్రాక్షుడు, అతని సైన్యం మొత్తం భస్మీపటలం అయిపోయారట. హుంకారం అంటే అమ్మయొక్క నాద స్వరూపం; ఆ నాదస్వరూపం వల్ల అజ్ఞానమనే పొగ అంతా చెదిరిపోయింది.

అప్పుడు చండముండులు ఇంకా అనేక మంది సైన్యంతో బయల్దేరి వచ్చారు. వాళ్ళిద్దరితో యుద్ధం జరిగినప్పుడు అమ్మ వారు కోపంగా చూశారు. వెంటనే అమ్మ భృకుటి నుండి నల్లని స్వరూపం ఒకటి ఆవిర్భవించిందట. ఆ తల్లి మహాకాళి. ఆమె చండ ముండుల్ని సంహరించి ఇద్దరితలలూ పట్టుకొచ్చిందట. ఆమె వెళ్ళేటప్పుడు తోవలో రథభట తురగ పదాతి బలాలన్నీ అమ్మవారి మీదకి దాడిచేశాయట. ఆమె వెళుతూ వాటిని చేతులతో పట్టుకుని నోటిలో వేసుకుంటూ వెళ్ళిపోయిందట. సృష్టి యొక్క అనంతత్వాన్ని తలచుకుంటే భయం, తలచుకోకుంటే అజ్ఞానం. కానీ అనంతకాలం, అనంత దేశం... ఏమిటిది అనుకుంటే మహాభయానికి లోనవుతాం. ఆ భయం నుండి మనని జాగృత పరచడానికి ఏ అనంత చైతన్యమున్నదో ఆ అనంత చైతన్యమే అంతటా ఉంది అని చెప్పారు భారతీయ మహర్షులు. అనంత వ్యాపకమైన చైతన్యమే ఒక చిన్న అణువులో కూడా ఉన్నదని చెప్పారు. అలాగ అనంత వ్యాపకమైన కాలశక్తే కాళి. ఇప్పటికి కాలం ఎన్ని తిన్నదో! కాల గర్భంలో ఎన్ని వెళ్ళిపోయాయో, ఇప్పటికీ అంతుపట్టదు. కాలం యొక్క అనంతత్వం ఎంత అని మనకేం తెలుసు?. "ఎన్ని కల్పాలు జరిగాయి అమ్మా" అని అడిగితే ఆమె తన మెడలో ఉన్న మాలను చూపించి లెక్కపెట్టుకో అన్నారట. ఆ మాల ఏమిటి అంటే పుర్రెల దండ. ఒక్కొక్క పుర్రె ఒక్కొక్క బ్రహ్మదట. ఒక్కొక్క బ్రహ్మ ఆయువు నూరు కల్పాలు. బ్రహ్మలు ఎందరు వెళ్ళారో లెక్కపెట్టుకో అని మాల ఇచ్చింది. మాల అంటే అంతులేనిది అని, అంటే ఆద్యంతరహితం అని. ఆ కాలంలోకి అలా ఎంతమంది వెళ్ళిపోయారో లెక్క లేదు. ఎన్ని వెళ్ళిపోయాయో! అన్నీ కబళించి వెళ్ళింది. అందుకే "మహాకాళీ మహాగ్రాసా మహాసనా" అన్నది లలితా సహస్రం.

ప్రళయకాలంలో అమ్మవారు మొత్తం జగతిని భక్షిస్తుందట. ప్రళయకాలంలోనే కాళి ఉన్నదా అంటే ప్రతీక్షణంలోనూ కాళి ఉన్నది. క్షణం ఇలా జరగగానే అలా కబళిస్తున్నది. అలాగ కబళించే లక్షణం కలది కాలం. అంతుపట్టని అనేక రహస్యాలు ఈ స్వరూపంలో కనిపిస్తాయి. ❖ **సశేషం**

ధీరవాణి

\- స్వామి వివేకానంద

ఆత్మారాముడివై జీవించు

ఆత్మలోనే నిష్ఠుడవవు. అప్పుడే నిజమైన విశ్వప్రేమ కలుగుతుంది. అత్యున్నత వైఖరి పాటించు; సర్వగతమైన మన స్వభావాన్ని గ్రహించి, ప్రపంచమనే సర్వ దిగ్దర్శక చిత్రాన్ని పరిపూర్ణ శాంతితో చూడాలి. సంసారం శిశుక్రీడ; మనకిది తెలుసు, కాబట్టి దీని వల్ల కలవరపడం. భూషణ చేత మనస్సుకు ప్రీతి ఏర్పడితే దూషణ చేత అప్రీతి కలుగుతుంది. ఇంద్రియాల వల్ల కలిగే సుఖం క్షణికం.

సృష్టిలో మనకు ప్రవేశం కలుగగానే మనకది సజీవమవుతుంది. స్వతస్సిద్ధంగా విషయాలు ప్రాణ రహితాలు, మనమే వాటికి ప్రాణం పోస్తున్నాం, అప్పుడు మనం మూర్ఖుల మాదిరి వాటిని చూసి భయపడుతూ ఉంటాం, లేదా వాటిని అనుభవిస్తుంటాం. సంత నుంచి ఇంటికి పోతూ, దారిలో గాలివానకు గురై ఒక పుష్పలావికుని ఇల్లు చేరిన బెస్తపడుచుల మాదిరి వర్తించకు. వారికి ఆతడు తన పూతోటకు పక్కనున్న గదిలో నాటి రాత్రి పడుకోవటానికి తావిచ్చాడు. అక్కడి వాతావరణం పువ్వుల సువాసనతో ఘుమఘుమ లాడుతూంటే, దాని వల్ల బెస్త పడుచులకు నిద్ర పట్టలేదు. చిట్టచివరకు వారు తమ చేపల బుట్టల మీద నీళ్ళు చల్లి, తమ తలల వద్ద పెట్టుకొన్నారు. అప్పుడు వారికి గాఢనిద్ర పట్టింది.

సంసారమే మన చేపల బుట్ట. భోగార్థం మనం దానిపై ఆధారపడకూడదు. అలా ఆధారపడేవారు తామసికులు, సంసారబద్ధులు. వీరి తరువాత గణింపదగ్గవారు రాజసికులు. ఎంతసేపూ 'నేను, నేను' అని పలుకుతూ వీరు అహంభావ పూరితులై ఉంటారు. ఒక్కోసారి వీరు సత్కర్మ చేస్తూ ఉంటారు. తన్మూలంగా వీరు పారమార్థికులు కావచ్చు. కానీ అంతర్ముఖులై, ఆత్మారాములై ఉండే వారు ఉత్తమోత్తములు, వీరే సాత్త్వికులు. ❖

With Best Compliments From

PENNAR INDUSTRIES LIMITED

305, Saptagiri Towers, Begumpet, Hyderabad - 500 016

పెన్నార్ కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.



పరిప్రశ్న

- స్వామి సుకృతానంద

- యల్.రాధాకృష్ణ, కడప

? : భక్తునిపై 'మాయ' ప్రభావం ఎలా ఉంటుంది? 'మాయ' అంటే ఏమిటి?

✍: మాయ దైవీ శక్తి. భగవంతుని నుండే వచ్చింది. ఆయన అధీనంలో ఉంటుంది. మాయను దాటడం చాలా కష్టం. భగవంతుణ్ణి ఆశ్రయించిన వారే దాన్ని దాటగలరు. "ఎవరైతే నన్నే శరణాగతితో వేడుకుంటారో వారిని తరింపజేస్తాను" అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో (7-14) హితవు పలికాడు.

దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా,
మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే ॥

'యా' 'మా' ఏది లేదో అదే మాయ అంటారు శ్రీరామకృష్ణులు: నేనూ, నా వారు, భార్య, భర్త, పిల్లలు అనుకోవడం మాయ. అందరూ తనవారే అనుకొని వారికి సహాయం చేయడం దయ అంటారు. వేదాంత పరిభాషలో దీన్ని **అనిర్వచనీయం** అంటారు.

భగవంతుణ్ణి మరిపింపజేసి ఈ ప్రపంచమే సర్వస్వం అనుకొనేలా చేసేది మాయ. అరిషడ్వర్గాలైన కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యాలకు లోనై ఉండేవాడు మాయలో ఉన్నట్లే. భగవంతుడే సత్యం, మిగతాదంతా అసత్యం అనే భావన వచ్చినప్పుడు మాయను అధిగమించవచ్చు. "ఎవరు మాయను దాటగలరు" అని రెండు సార్లు ప్రశ్నించి, "అవతార పురుషులనూ, మహాత్ములనూ సేవించినవారే మాయను దాటగలరు" అని భక్తిసూత్రాల్లో నారదమహర్షి చెప్పారు.

'అవ్యక్తనామ్నీ పరమేశ శక్తి రనాద్యవిద్యా త్రిగుణాత్మికా పరా కార్యానుమేయా సుధియైవ మాయా యయా జగత్సర్వమిదం ప్రసూయతే'   (వివేకచూడామణి శ్లోకం-110)

'...మహాద్భుతా నిర్వచనీయ రూపా' (వివేకచూడామణి-111)

దీని పేరు అవ్యక్తం. త్రిగుణాత్మకమైనది దీని రూపం. అనాది అయిన అవిద్యా స్వరూపం. ఈ జగత్తు అంతా మాయ వల్లే పుడుతోంది. వర్ణింప శక్యం కానిది. మహాద్భుతమైనది మాయ.

'శుద్ధాద్వయ బ్రహ్మ విబోధనాశ్యా సర్పభ్రమో రజ్జు వివేకతో యథా...' (వివేకచూడామణి-112) - మునిమాపు వేళ పాము, త్రాడు అనే జ్ఞానం కలగగానే భ్రమ తొలగినట్లు అద్వితీయ శుద్ధ బ్రహ్మ జ్ఞానం కలగడంతోనే మాయ తొలగుతుంది.

ఒకసారి నారదుడు 'నీ మాయను చూడాలని ఉంది'అని శ్రీకృష్ణుణ్ణి కోరాడు. శ్రీకృష్ణుడు అతణ్ణి తీసుకొని ఎడారి మార్గంలో వెళుతూ దప్పికై, కొంచెం మంచినీళ్ళు కావాలని కోరాడు. నారదుడు అల్లంత దూరాన ఉన్న ఒక ఇంటికి వెళ్ళి అక్కడ ఒంటరిగా ఉన్న కన్యను చూసి మోహించాడు. ఆమెను పెళ్ళి చేసుకొని సంసార జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. ఒకసారి వరద వచ్చింది. భార్యా, పిల్లల్ని రక్షించబోయి అందరినీ వరదలో పోగొట్టుకొన్నాడు. అప్పుడు విలపిస్తున్న నారదుణ్ణి, శ్రీకృష్ణుడు తన చేతితో స్పృశించి "నారదా! మంచినీళ్ళు ఏవీ?" అని అడిగాడు. అప్పుడు నారదుడికి స్పృహ వచ్చింది. ఇదే మాయ. క్షణంలో అంతా మరిపిస్తుంది.

భగవంతుని కృపతోనే మాయను దాటవచ్చు. మాయను గురించి వివరిస్తూ- 'ఉన్న వస్తువు (బ్రహ్మ) ఒక్కటే. ద్రవ్యమో! చైతన్యమో!! వాటి రెంటినీ విడదీసి ఆలోచించడం కష్టం. అదే మాయ. అదే అజ్ఞానం' అన్నారు స్వామి వివేకానంద. ❖

నారికేళ విశిష్టత

హిందువులకు సంబంధించి అన్ని ధార్మిక కార్యక్రమాల్లోనూ, శుభకార్యాల్లోనూ నారికేళానిది ముఖ్యమైన పాత్ర. నారికేళాన్ని అందరూ శుభసూచకంగా భావిస్తారు. సంపదకూ, గౌరవ ప్రతిష్ఠలకూ, పురోభివృద్ధికీ, అదృష్టానికీ కొబ్బరికాయ ప్రతీక అని భారతీయుల విశ్వాసం. కాబట్టి, దేవతలందరికీ కొబ్బరి కాయ సమర్పించడం మన ఆచారం.

కలశంలో కొబ్బరి కాయ

మన దేశంలో ఏ గుడికి వెళ్ళినా, దేవుడికి సర్వసాధారణంగా అర్పించేది - నారికేళమే! అలాగే, పెళ్ళిళ్ళు, పేరంటాలు, పండుగలు, పబ్బాలు వచ్చాయన్నా, కొత్త వాహనమో, ఇల్లో కొన్నామన్నా కొబ్బరికాయ కొట్టడం మన సంస్కృతిలోని అలవాటు. కీలకమైన కార్యక్రమాల్లో కలశంలో నీళ్ళు పోసి,

దానిలో మామిడాకులు వేసి, ఆ పైన కొబ్బరికాయను అమర్చి, ఆ కాయకు అయిదు చోట్ల కుంకుమ బొట్లు పెట్టి, ఆ కలశాన్ని ఆరాధించడం మన సంస్కృతి. అలా కలశం మీద ఉంచిన నారికేళానికి సాధారణంగా ఎర్ర రంగు వస్త్రం కప్పుతారు. ఎవరైనా గౌరవనీయులైన అతిథులు వచ్చినప్పుడు వారిని ఈ పూర్ణకుంభంతో స్వాగతించడం కూడా మనం చూస్తుంటాం.

వరుణదేవుడికి నారికేళం

పెళ్ళి, పేరంటాల్లో వచ్చిన అతిథులకు నారికేళాన్ని కానుకగా ఇచ్చి పంపే సంస్కృతి కూడా కొన్ని చోట్ల ఉంది. అతిథులను అలా గౌరవించడం స్వచ్ఛతకు చిహ్నం. మన దేశంలో చాలా చోట్ల శరత్ పూర్ణిమ సందర్భంగా వరుణదేవుడికి నారికేళాన్ని సమర్పించే ఆచారం ఉంది.

నారికేళాన్ని కాయగానే అర్పించడం, లేదంటే కాయను కొట్టి సమర్పించడం - రెండు రకాల పద్ధతులూ ఉన్నాయి. సాధారణంగా ఏదైనా కార్యక్రమం ఆరంభంలో కొబ్బరి కాయను మొత్తంగా సమర్పిస్తుంటారు. ఆ తరువాత దాన్ని కొట్టి, ప్రసాదంగా ఇస్తుంటారు.

యజ్ఞ యాగాదులు చేస్తున్నప్పుడు హోమాగ్ని కుండంలో నారికేళాలను ఆహుతులుగా వ్రేల్చడం జరుగుతుంటుంది. అలాగే, దేవుడికి కొబ్బరికాయ కొట్టి, ఆ వచ్చిన రెండు కొబ్బరి చిప్పలనూ దేవుని ముందు పెట్టి, నైవేద్యం పెడుతుంటాం. ఆ పైన దేవుని ప్రసాదంగా స్వీకరిస్తుంటాం. దేవుణ్ణి సంతృప్తిపరచడానికీ, మన కోరికలన్నీ తీరడానికీ ఇలా కొబ్బరికాయలు కొడుతుంటాం. కొబ్బరికాయకు ఉండే మూడు కళ్ళూ, పరమేశ్వరుని త్రినేత్రాలకు ప్రతీక కాబట్టి, కొబ్బరికాయ పరమ శివునికి ప్రీతిపాత్రమైనదని ఓ నమ్మకం. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురూ నారికేళంలో వసిస్తుంటారని ఓ నమ్మిక.

కొబ్బరి కాయ ఎలా కొట్టాలి?

దేవుడికి ఎలాంటి కొబ్బరికాయ కొట్టాలి, ఎలా కొట్టాలనే దానికి పెద్దలు ఓ సులభ సూత్రం చెప్పారు. కొబ్బరి కాయను కొనేటప్పుడే దాన్ని చేతిలోకి తీసుకొని, చెవి దగ్గర పెట్టుకొని, చేతితో ఆడించి చూడాలి. కొబ్బరికాయలోని నీళ్ళ శబ్దం తెలుస్తోందో, లేదో గమనించాలి. కాయ మీద వేలితో కొట్టి చూడాలి. అప్పుడు అయ్యే శబ్దాన్ని బట్టి ఆ కొబ్బరి కాయ మంచిదో, కుళ్ళినదో ముందుగానే కనిపెట్టవచ్చు. చెడిపోయిన కాయలను దేవుడికి కొట్టకూడదు, నైవేద్యం పెట్టకూడదు.

పిలక ముఖ్యం!

పీచు తీయని కొబ్బరి కాయను కొంటే, ముందు జాగ్రత్తగా ఆ పీచు తీయాలి. అన్ని వైపులా పీచు తీయవచ్చు కానీ, దేవుడికి కాయ కొట్టాలంటే, చిన్న పిలక లాగ పీచును మాత్రం ఉంచేయాలి. అలా పిలక ఉన్న కొబ్బరి కాయలే దేవుడికి కొట్టాలి. అంతే కానీ, అన్ని వైపులా పూర్తిగా పీచు తీసేసిన బోడి కొబ్బరికాయలను దేవుడి నైవేద్యం కోసం కొట్టకూడదు.

కొబ్బరి కాయ మీద కళ్ళ లాగ మూడు గుర్తులుంటాయి. కాయను చేతితో పట్టుకొని పైకెత్తి కొట్టేటప్పుడు ఆ మూడింటిలో రెండు కళ్ళు మన కళ్ళకు కనబడుతూ, మన వైపు చూస్తున్నట్లుండాలి. దాంతో, కొబ్బరి కాయ మీది మూడో కన్ను కిందికి ఉంటుంది. ఇలా పట్టుకొని, కొబ్బరి కాయను కొట్టడం వల్ల కాయ సరిగ్గా, గుండ్రంగా పగిలే అవకాశాలు ఎక్కువ. ❖

(వచ్చే సంచికలో 'నారికేళ నివేదనలో అంతరార్థం')

నది మార్గాన్ని మళ్ళించిన మహర్షి

కథ : స్వామి జ్ఞానదానంద   చిత్రాలు : దాకోజు శివప్రసాద్










5
కవషుడికి సత్రయాగం చూడాలని ఉంది;
అందుకని నదీ తీరానికి దూరంగా వెళ్ళి ఇసుకలో
కూర్చొని యాగాన్ని చూడసాగాడు.


6
ఇంతలో కవషుడికి దాహం వేసింది. నీళ్ళు తాగాలంటే
యాగస్థలం దాటి నదీ తీరానికి వెళ్ళాలి. ఋషులకు ఆగ్రహం
కలిగించడం ఎందుకని కవషుడు అప్పటికప్పుడు "అపోనప్త్రీయము"
అనే సూక్తం రచించి సరస్వతీ నదీ దేవతను ప్రార్థించాడు.


7
అప్పుడు సరస్వతీ నది ప్రసన్నురాలై, తీరం నుండి ఒక పాయగా విడిపోయి,
ప్రవహిస్తూ వెళ్ళి కవషుడి వద్ద ఆగింది. కవషుడు దోసిలిలో నీరు పట్టి దాహం తీర్చుకున్నాడు.

8
యాగం చేస్తున్న మునులు ఈ అద్భుతాన్ని చూసి ఆశ్చర్యపోయారు. వారు యాగం మధ్యలో ఆపి కవషుణ్ణి సమీపించారు.

మిగతా 36వ పేజీలో...

అయిదు రోజుల ఆనందోత్సాహాల పండుగ

– స్వామి సర్వస్థానంద

దేశ విదేశాల్లోని భారతీయులందరూ అత్యంత ఉత్సాహంతో జరుపుకొనే పండుగలలో దీపావళి ఒకటి. బ్రహ్మదేవుడు శ్రావణపూర్ణిమ నాటి ఉపాకర్మ (రక్షాబంధనోత్సవం)ను బ్రాహ్మణులూ, దేవీనవరాత్రులను (దసరా) క్షత్రియులూ, దీపావళిని వైశ్యులూ, హోళికా పూర్ణిమను శూద్రులూ జరపాలని నిర్ణయించినట్లు ఒక కథ ఉంది.

దీపావళి మొత్తం ఐదు రోజుల పండుగ. ఇది సాధారణంగా అక్టోబర్ చివర్లో కానీ, నవంబర్ మొదట్లో కానీ వస్తుంది. మొదటి రోజు ఆశ్వయుజ బహుళ త్రయోదశి – దీనినే "ధనత్రయోదశి" అనీ, "ధన్ తేరస్" అనీ అంటారు. పశ్చిమ భారతదేశంలోని జైనులూ, వ్యాపారస్థులూ దీనికి చాలా ప్రాముఖ్యం ఇస్తారు. ఈ రోజున లక్ష్మీదేవిని ఆరాధిస్తారు. బంగారం కానీ, వెండి కానీ, పాత్ర సామగ్రి కానీ ఈ రోజున కొనడం శుభప్రదం అని వారి నమ్మిక.

బీహార్‌లోనూ, ఉత్తర భారతదేశంలోనూ దేవవైద్యుడైన 'ధన్వంతరి' గౌరవార్థం ధన్ తేరస్ జరుపుతారు. క్షీరసముద్ర మథనం జరిగినప్పుడు చేతిలో పాత్రను పట్టుకొని ధన్వంతరి ఉద్భవించాడట. అందుకే ఆ రోజున బంగారం కానీ పాత్ర సామగ్రి కానీ కొనడం ఆచారం. వర్షాకాలం చివర్లో వచ్చే ఈ పండుగ సమయంలో ధన్వంతరి పూజ పరిశుద్ధతకీ, ఆరోగ్యపరిరక్షణకీ గల ప్రాముఖ్యాన్ని చెప్పకనే చెబుతుంది.

రెండో రోజు ఆశ్వయుజ బహుళ చతుర్దశి. దీన్ని 'నరక చతుర్దశి' అంటాం. పూర్వ కాలంలో నరకవాసాన్ని తప్పించుకునేందుకు యముడి గౌరవార్థం పండుగ జరిపేవారు. అయితే నరకాసుర సంహారం ఆ రోజున జరిగింది కనుక నరకుడి తల్లి అయిన భూదేవి తన పుత్రుడు మరణించిన రోజున ఉత్సవం జరపాలన్నదట. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక నరకాసురవధ. సూర్యోదయానికి ముందే అభ్యంగన స్నానం చేసి, యమధర్మరాజుకు తర్పణాలు విడిచి, దీపం వెలిగిస్తే నరకానికి వెళ్ళరనే నమ్మకం ప్రజలకు ఉంది. సూర్యాస్తమయం అయ్యాక ఇళ్ళనూ, ఆలయాలనూ దీపాలతో అలంకరిస్తారు.

మూడోరోజు ఆశ్వయుజ అమావాస్య. సంవత్సరం మొత్తమ్మీద అతి చీకటిగా ఉండే రాత్రి. ముందురోజులాగే సూర్యోదయానికి ముందే అభ్యంగన స్నానం చేసి అలక్ష్మి (అశుభం) తొలగడానికి లక్ష్మీదేవిని పూజిస్తారు. రెండు రోజులూ పితృదేవతలకు తర్పణాలు విడుస్తారు. కొన్ని ప్రాంతాల వారు పగలు ఉపవాసం ఉండి, రాత్రి బంధువులు,

స్నేహితులతో కలిసి విందు ఆరగిస్తారు. సాయంకాలం ఇళ్ళను దీపాలతో అలంకరించి, టపాసులు కాలుస్తారు.

పూర్వం దీపావళి పంటల పండుగ. వ్యవసాయదారులూ, వర్తకులూ దీపావళి నాటికి పాత బాకీలు చెల్లించి, ఖాతా పుస్తకాలలోని లెక్కలన్నీ సరిచూసేవారు. వారికి దీపావళితో కొత్త సంవత్సరం మొదలయ్యేది. కాలక్రమంలో ఈ పండుగ ఆధ్యాత్మికంగా ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. ఈ పండుగకు సంబంధించి ఎన్నో పురాణ గాథలు ఉన్నాయి. తమ పధ్నాలుగు సంవత్సరాల వనవాసాన్ని ముగించుకొని సీతా రామ లక్ష్మణులు అయోధ్యకు తిరిగి వచ్చిన శుభసందర్భంలో అయోధ్యావాసులు తమ తమ ఇళ్ళను దీపాలతో అలంకరించుకున్నది దీపావళి నాడే అని ఉత్తర భారతదేశవాసులు చెప్పే కథ ప్రముఖమైనది.

మరొక కథ ప్రకారం... క్షీరసముద్ర మథనం జరిగినప్పుడు లక్ష్మీదేవి ఆ పాలసముద్రం నుండి ఉద్భవించినది దీపావళి నాడే! అందుకే దీపావళి నాడు లక్ష్మీపూజ చెయ్యడం. ఆనాడు మరికొందరు కాళీమాతను ఆరాధిస్తారు. ముఖ్యంగా వంగదేశంలో అమావాస్య నాటి రాత్రి మట్టితో చేసిన కాళీ ప్రతిమను పూజిస్తారు. దక్షిణ దేశంలో హిరణ్య కశిపుడి వధకు గుర్తుగా దీపావళి జరుపుతారు. జైనులు తమ ప్రభువు మహావీర్ పరినిర్వాణం చెందిన దినంగా పరిగణిస్తారు. 18 దేశాల రాజులు తమ మధ్యన ఉన్న జ్ఞానప్రకాశం తమకు దూరమైనందుకు గుర్తుగా ఆ రోజున తమ దేశాలలో దీపాలను వెలిగిద్దామనుకున్నట్లు జైనుల నమ్మకం. వారు దీపాలు వెలిగించడంతో పాటు శారదాపూజ (జమా ఖర్చుల పుస్తకాలను పూజించడం), లక్ష్మీపూజ కూడా చేస్తారు. విక్రమశకాన్ని పాటించే గుజరాత్ తదితర ప్రాంతాల వారికి సంవత్సరంలో చివరిరోజు దీపావళి.

తరువాతి రోజు కార్తీక శుక్ల పాడ్యమి. దీన్ని బలి పాడ్యమి అని కూడా అంటారు. వామనావతారం ధరించిన విష్ణుమూర్తి రాక్షసరాజైన బలిచక్రవర్తిని పాతాళానికి పంపినది ఈ రోజునే అని పురాణాలు చెబుతున్నాయి. దేశంలోని అనేక ప్రాంతాల వారు బలిచక్రవర్తిని- భార్య వింధ్యావళితో సహా ఈ రోజున పూజిస్తారు. కార్తీక శుక్ల పాడ్యమి నాడు ఉత్తర భారతదేశంలో గోవులనూ, ఎద్దులనూ పూజించడం; వైష్ణవులు గోవర్ధన పర్వతాన్ని పూజించడం, అన్నకూట ఉత్సవం జరపడం కనపడతాయి. గోవర్ధనగిరికి దూరంగా ఉండే ప్రజలు ఆవు పేడతో కానీ, అన్నపురాశితో కానీ కొండలా చేసి పూజిస్తారు. దానినే 'అన్నకూటం' అంటారు.

'శ్రీరామకృష్ణ కథామృతం'లో అన్నకూట ఉత్సవానికి సంబంధించిన ఆసక్తి కరమైన సంఘటన ఒకటి ఉంది: ఒకమారు శ్రీరామకృష్ణులవారిని కలకత్తాలోని మార్వాడీలు తాము జరుపుతున్న అన్నకూట ఉత్సవానికి ఆహ్వానించారు. 'మ', ఇతర భక్తులతో కలిసి శ్రీరామకృష్ణులు ఉత్సవానికి వెళ్ళి, తామూ ఉత్సవంలో పాలుపంచుకుని, అమిత ఆనందోత్సాహాలతో సంధ్యాసమయమయ్యాక తిరుగు ముఖం పట్టారు. శ్రీరామకృష్ణులు "మీరు ఇక్కడ చూసిన ఉత్సవం బృందావనంలో కూడా జరపబడింది. అయితే అక్కడ అన్నపురాశి ఇంకా పెద్దదిగా ఉంది; ఇంకా ఎక్కువమంది ఉత్సవంలో పాల్గొన్నారు. అక్కడ గోవర్ధన పర్వతం కూడా ఉంది. మార్వాడీల భక్తి చూశారా? అదే అసలైన హైందవ ఆదర్శం; అదే సనాతన ధర్మం. హిందూ మతం సనాతన ధర్మం. అది ఎప్పటి నుండో ఉంది. అదొక్కటే ఎప్పటికీ నిలచి ఉంటుంది" అన్నారు.

ఐదవది కార్తీక శుక్ల విదియ. దీన్నే యమద్వితీయ అనీ, భ్రాతృ ద్వితీయ అనీ అంటారు.

బ్రహ్మాండ పురాణంలో "యమధర్మరాజును ఆయన సోదరి యమున తన ఇంటికి విందుకు ఆహ్వానించింది" అని ఉంది. ఆ రోజున తమ సోదరి ఇంట భుజించి, ఆమెకు బహుమతి ఇస్తారు సోదరులు.

దుర్గాపూజ లాంటి ఇతర పండుగలలాగ దీపావళికి ధార్మిక, మతపరమైన ప్రాముఖ్యం లేకున్నా అన్ని ప్రాంతాల వారూ జరుపుకొనే ప్రముఖమైన పండుగగా ప్రఖ్యాతి గాంచింది. వివిధ వర్గాల మధ్య సోదర ప్రేమను ఇనుమడింప జేసి సమాజంలో అందరూ కలిసిమెలసి ఐకమత్యంతో జీవించేందుకు తోడ్పడుతుంది ఈ దీపాల పండుగ. ❖

దీపావళి శుభాకాంక్షలు

పాఠకులకు, రచయితలకు,
రచయిత్రులకు, దాతలకు,
ఏజెంట్లకు, ప్రకటనకర్తలకు
హృదయపూర్వక
దీపావళి శుభాకాంక్షలు.

- శ్రీరామకృష్ణ ప్రభ

ఓ మహాత్యాగి ఆత్మకథ

(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

(...గత సంచిక తరువాయి)

(మహా భక్తుడు, అద్వైత వేదాంతి, కర్మయోగి, ప్రవక్త, శ్రేష్ఠసన్న్యాసి, గురువు, యుగాచార్యుడు, దేవదూత, పరమహంస శిష్యుడు, మానవ జాతి ప్రేమికుడు, మహా దేశభక్తుడు, ధ్యానసిద్ధుడు, మహాయోగి, గంధర్వ గాయకుడు ఇలా విభిన్న రూపాలలో స్వామి వివేకానంద మనకు దర్శనమిస్తారు. స్వామీజీ సంభాషణలు, ఉపన్యాసాలు, వ్యాసాలు, లేఖల్లో స్వయంగా తెలిపిన తన జీవితానుభవాలను ధారావాహికంగా 2009 జూన్ సంచిక నుంచి అందిస్తున్నాం.)

ఓ రోజు శ్రీరామకృష్ణులు "నీకు కావాలంటే నీ హృదయంలో శ్రీకృష్ణుణ్ణి దర్శింపచేస్తాను" అన్నారు. "నాకు అలాంటి వాటి మీద నమ్మకం లేదు" అన్నాను. ఒకసారి "మీరు చూసే దైవ దర్శనాలు, వగైరాలు మీ ఊహాజనితాలు మాత్రమే! నిజాలు కావు" అన్నాను. నా మాటలు విని ఆయన కాళికాలయానికి వెళ్ళి జగన్మాతతో "అమ్మా! దైవ దర్శనాలన్నీ కేవలం ఊహాజనితాలేనా?" అని అడిగారు. తరువాత నాతో "ఈ దర్శనాలన్నీ నిజాలని సాక్షాత్తూ అమ్మ చెప్పింది!" అన్నారు.

మరోసారి (తన హృదయాన్ని చూపిస్తూ) "నీవు పాడేటప్పుడు, ఇక్కడ ఎవరైతే ఉన్నారో ఆయన ఓ సర్పంలా తన పడగ విప్పి నిలకడగా నిలిచి నీ సంగీతం వింటాడు" అన్నారు.

మేమిద్దరమూ వేదాలు, బైబిల్, ఖురాన్... ఇంకా ఇతర మత గ్రంథాల గురించి మాట్లాడుకొనేవాళ్ళం. ఒకసారి సంభాషణ ముగిస్తూ, ఆయన టేబిల్ మీద నుంచి ఓ పుస్తకం తీసుకురమ్మన్నారు. అందులో మిగతా విషయాలతో పాటు, ఆ సంవత్సరంలో ఎంత వర్షం కురుస్తుందో ముందుగా వ్రాయబడి ఉంది. "దాన్ని చదువు" అన్నారాయన. ఎంత వర్షం కురవబోతోందో ఆ సంఖ్య చదివాను నేను. "ఇప్పుడు పుస్తకం తీసుకుని బాగా పిండు!" అన్నారు. అలాగే చేశాను. అప్పుడు ఆయన ఇలా అన్నారు: "ఏం నాయనా! ఒక్క చుక్క నీరు కూడా రావడం లేదు! అది కేవలం పుస్తకం మాత్రమే! నీ మతం నిన్ను భగవత్ సాక్షాత్కారానికి అర్హుణ్ణి చేయనంతవరకూ అది వృథాయే! మతమంటే కేవలం గ్రంథాలు, శాస్త్రాలు అనుకొని వాటిని అధ్యయనం చేసేవారు తన వీపు మీద చక్కెర బస్తాలు మోసినా, దాని తియ్యదనం తెలియని గాడిద లాంటివారని నాకనిపిస్తుంది!..." మొదట్లో నేను ఆయన చెప్పినదేదీ నమ్మలేదు. ఓ రోజు ఆయన "మరి ఇక్కడికి ఎందుకొస్తున్నావ్?" అని అడిగారు. "నేను ఇక్కడికి మిమ్మల్ని చూడడానికి వస్తున్నాను. మీ మాటలు వినడానికి కాదు" అన్నాను. అందుకు ఆయన చాలా సంతోషించారు.

ఒక రోజు మేమిద్దరమే ఉండగా ఆయన, "నేను మహిమలనూ, సిద్ధులనూ ఉపయోగించ లేదు. కానీ నీ ద్వారా చేయగలను, నీవేమంటావు?" అన్నారు. "లేదు, మీరలా చేయలేరు!" అని నేనన్నాను. ఆయన దర్శనాలు, భావ సమాధులు అన్నీ మతి భ్రమలని చెప్పాను. ఆయనిలా అన్నారు: "దక్షిణేశ్వరం కాళికాలయంలో మేడ (కుఠీ) పైకి ఎక్కి, గట్టిగా రోదించేవాణ్ణి. ఓ భక్తులారా! మీరంతా ఎక్కడున్నారు? రండి నాయనలారా! నేను మిమ్మల్ని చూడడానికి తపిస్తున్నాను. మిమ్మల్ని చూడకపోతే మరణిస్తాను. భక్తులు తప్పక వస్తారు నాయనా అని జగన్మాత అన్నది. చూశావా! అమ్మ చెప్పినదంతా నిజమేనని తెలుస్తోంది కదా!" అందుకు నేనేమీ ఆయనకు బదులు చెప్పలేకపోయాను.

నా ఆశయాలు, ఆదర్శాలనే నేను చేసే పనులన్నింటిలో ఆచరించేవాణ్ణి. గురుదేవులీ విషయంలో ఏనాడూ జోక్యం కలిగించుకోలేదు.... నేను 'సాధారణ బ్రహ్మసమాజం'లో సభ్యుడినయ్యాను. ఓ రోజు ఆయన "నీవు ఈ విషయం రాఖాల్ (స్వామి బ్రహ్మానంద)తో చెప్పవద్దు, చెబితే తనూ చేరతానని అంటాడు!" అన్నారు. నేను దక్షిణేశ్వరం వెళ్ళినప్పుడు, గురుదేవులు ఇతరులను చదవవద్దని వారించే వేదాంత గ్రంథాలు నన్ను చదవమని ఇచ్చేవారు. తన గదిలో

ఉన్న 'అష్టావక్ర సంహిత' గ్రంథాన్ని వేరెవరైనా చదవబోతే ఆయన వారించి, దానికి బదులుగా 'ముక్తి – దానికి సాధనలు', భగవద్గీత, లేదా ఏదైనా ఒక పురాణం చదవాల్సిందిగా ఇచ్చేవారు. ఒక్కోసారి అద్వైత భావాలతో నిండిన 'అధ్యాత్మరామాయణం'లోని ఒక భాగం చదవ మనేవారు... అప్పుడు కొన్నిసార్లు మొండిగా "ఈ పుస్తకం చదవడం వల్ల లాభమేంటి? 'నేనే దేవుణ్ణి' అని తలవడం కూడా పాపం! ఈ పుస్తకం ఈ ఘోర పాపాన్ని బోధిస్తోంది. దీన్ని కాల్చేయాలి!"అని అన్నాను. ఆయన నవ్వుతూ "దాన్ని నీ కోసం చదవమన్నానా? నా కోసమే కొద్దిగా చదవ మన్నానంతే! నా కోసం చదువు. 'నేనే దేవుణ్ణి' అని నీవు

భావించనక్కర్లేదులే" అన్నారు. ఆ విధంగా ఆయన కోసమే ఆ పుస్తకాలు చదవాల్సి వచ్చేది.

ఒకరోజు గురుదేవుల దివ్యస్పర్శ నా మనస్సులో ఓ అద్భుతమైన పరివర్తన కలిగించింది. దాంతో విశ్వమంతా భగవంతుడు తప్ప మరేదీ లేదనే అనుభూతి కలిగింది. 'సర్వం బ్రహ్మమయం' (సర్వం ఖల్విదం బ్రహ్మ) అనుభూతిని పొందాను. కానీ ఇది ఎంత కాలం నిలుస్తుందో చూద్దామని మౌనంగా గమనించాను. ఆ రోజంతా ఈ అద్వైత స్థితి చెక్కుచెదరలేదు. ఇంటికి తిరిగొచ్చాను. అక్కడ నేను చూసిన సమస్తం బ్రహ్మముగా కనిపించింది. భోజనం చేద్దామని కూర్చున్నాను. కానీ అన్నం, పళ్ళెం, వడ్డించిన మా అమ్మ, ఆఖరికి నేనూ... సమస్తమూ అదే పరబ్రహ్మ చైతన్యం! ఒకటి రెండు ముద్దలు తిని అలాగే స్థిరంగా కూర్చుండిపోయాను. మా అమ్మ "ఎందుకలా కూర్చుండిపోయావు? భోంచేయి" అన్న మాటలతో ఉలిక్కిపడి మళ్ళీ తినడం మొదలుపెట్టాను. కానీ నేను తింటున్నా, పడుకున్నా, కళాశాలకు వెళుతున్నా, ఏమి చేస్తున్నా అన్ని వేళలా ఏదో ఒక అద్భుత దివ్యపారవశ్య స్థితి (సమాధి)లో ఉన్నట్లు అనుభూతి కలిగేది. వీధుల్లో నడుస్తుంటే, గుఱ్ఱపు బండ్లు పరుగెడుతున్నాయి. గుఱ్ఱబ్బళ్ళూ, నేనూ ఒకే చైతన్య వస్తువని కనిపించడంతో నాకు ప్రక్కకు తప్పుకోవాలని అనిపించలేదు. నాకప్పుడు బాహ్య స్పృహ లేదు. శరీర అవయవాలన్నీ మొద్దుబారినట్లుగా అనిపించింది. భోజనం నాకు రుచించలేదు, ఎవరో వేరే వ్యక్తి తింటున్నట్లుగా అనిపించింది. ఒకోసారి భోంచేస్తూనే నడుం వాల్చేవాణ్ణి! కొన్ని నిమిషాల తర్వాత లేచి మళ్ళీ తినేవాణ్ణి. కొన్ని రోజులు చాలా ఎక్కువగా తినేవాణ్ణి, కానీ ఏ హానీ జరిగేది కాదు. మా అమ్మ నా కేదో రోగం పట్టిందేమోనని బెంగ పెట్టుకుంది. నేనిక ఎక్కువ రోజులు బ్రతుకనేమో అని భయపడింది కూడా!... ఆ స్థితిలో కొంచెం మార్పు వచ్చాక ప్రపంచమంతా ఓ కలలాగ కనిపించసాగింది! కలకత్తా లోని 'కార్న్ వాలిస్ సర్కిల్' లో నడుస్తున్నపుడు రహదారి పక్కన ఇనుప కడ్డీలతో ఉన్న కంచె 'నిజమా కాదా?' అని తెలుసుకొందామని వాటికి నా తలను కొట్టుకునేవాణ్ణి! ఈ విధంగా కొన్నాళ్ళు కొనసాగింది. మామూలు స్థితికి వచ్చాక కచ్చితంగా నేను అద్వైత అనుభూతిని కొంచెం చవిచూశానని స్పష్టంగా గ్రహించాను. అప్పుడే శాస్త్ర వాక్యాలు అబద్ధాలు కావని నాకు స్ఫురించింది. అప్పటి నుండీ అద్వైత తత్త్వపు సిద్ధాంతాలను నిరాకరించ లేకపోయాను.

నా జీవితంలో మొట్టమొదటిసారిగా భగవంతుణ్ణి చూశాననీ, మతమనేది అనుభవైక సత్యమనీ, ఈ ఇంద్రియ జగత్తు కంటే అవధులు లేనంత అధిక తీవ్రతతో ఆధ్యాత్మిక చైతన్యాన్ని అనుభవించవచ్చుననీ నిర్భయంగా, దృఢంగా చెప్పగలిగిన ఒక వ్యక్తిని చూశాను. ఆయన దగ్గరకు రోజుల తరబడి వెళ్ళసాగాను. వెళుతూ ఆధ్యాత్మిక తత్త్వానుభూతిని స్పష్టంగా మరొకరికి ఇవ్వవచ్చును అని నా కళ్ళతో ప్రత్యక్షంగా చూశాను! ఆయన ఒక్క స్పర్శ, ఒక్క చూపు, సమస్త జీవితాన్నే మార్చేయగలదు! ❖ (సశేషం)

అనుసృజన: స్వామి అర్చనానంద

రంతిదేవుడి దానగుణం

– ఆకెళ్ల రాఘవేంద్ర

దానగుణంలో ఒక మహోన్నతమైన ఆశయాన్ని నిలిపిన వాడు రంతిదేవుడు. దయను ప్రదర్శించడంలో అతనికి అతనే సాటి. తాను ఆకలితో అలమటించి పోతున్నప్పటికీ సాటివారి ఆకలిని గుర్తించి, తాను ఏమీ తినకుండా తోటివారి కడుపు నింపిన ధన్యజీవి రంతిదేవుడు. వ్యాసుడు రంతిదేవుడి పాత్రను ఎందుకు సృష్టించాడో తెలుసా? ఒక ఉదాత్త ఆదర్శాన్ని మానవాళికి అందించేందుకు! రంతిదేవుడి కథ ఆనాటి కన్నా ఈనాడు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం. అదెలాగో తెలుసుకొందాం.

పోతన రచించిన మహాభాగవతంలోని నవమ స్కంధంలో ఉన్న చిన్న కథ 'రంతిదేవుడి' కథ. రంతిదేవుడు ఒక రాజు. లెక్కలేనన్ని సంపదలు ఆర్జించాడు. అయితే చనిపోయేటప్పుడు ఆ ఆస్తులన్నీ తీసుకెళ్ళిపోవడం జరగదన్న సత్యం తెలిసినవాడు రంతిదేవుడు. అందుకే ఆకలిగొన్న వారికి, బాధల్లో ఉన్నవారికి, దీనులకి దానాలు చేసేవాడు. ఎంతటి ఆస్తి అయినా... ఇచ్చుకుంటూ వెళ్ళిపోతే తరిగిపోవాల్సిందే, కరిగిపోవాల్సిందే! రంతిదేవుడికీ జరిగిందదే!!

విపరీతంగా దానాలు చేయడం వల్ల కొంతకాలానికి రంతిదేవుడు తన సంపదను కోల్పోయాడు. రాజు కాస్తా పేదవాడైపోయాడు. అయినా ఇంటిలో ఉన్నంతవరకు ఏ వస్తువు ఉంటే ఆ వస్తువును దానం చేసేసేవాడు. మణిమయ రత్నఖచిత భవంతులు పోయి పర్ణశాలలో జీవించాల్సి వచ్చింది. అయినా తానూ తన కుటుంబమూ ఆ గుడిసెలోనే బతికేవారు.

విశేషమేమిటంటే, ఇంత జరిగినా రంతి దేవుడు కించిత్తయినా బాధపడలేదు. 'అయ్యో! నా ఆస్తులు పోయాయే' అని కన్నీరు కార్చలేదు. అనవసరంగా దానాలు చేశానని వాపోలేదు. గతాన్ని తలుచుకొని వర్తమాన దుఃస్థితి పట్ల వేదన చెందలేదు. ఎందుకంటే... రంతిదేవుడు తనకు తెలిసి దానాలు చేశాడు. కావాలని దానం చేశాడు. కీర్తి కోసమో, పొగడ్తల కోసమో దానం చేయలేదు. ఆనందం కోసం, ఇతరులకు సహాయం చేయడం కోసం దానం చేశాడు. దానం చేయడంలో వీరత్వం ప్రదర్శించాడు. అందుకే రంతిదేవుడు దానవీరుడయ్యాడు.

దగ్గర ఉన్నవన్నీ అయిపోయేంతవరకు దానాలు చేస్తూనే ఉన్నాడు. చివరకు చిల్లిగవ్వయినా లేని పరిస్థితి. చివరకు తానూ, తన కుటుంబమూ మూడు పూటలా కాదు... ఓ పూటయినా ఏమీ తినలేని పరిస్థితి. పస్తులుండాల్సిన స్థితి. ఒకటా.. రెండా.. ఏకంగా 48 రోజుల పాటు ఆహారం లేకుండా ఉండాల్సిన పరిస్థితి. అయినా గుండె దిటవును కోల్పోలేదు.

అలాంటి పరిస్థితుల్లో ఓ రోజు... రంతిదేవుడికి నేయీ, పాయసమూ, నీళ్ళూ లభించాయి. నలభై ఎనిమిది రోజుల పాటు పస్తులున్న కుటుంబం కాబట్టి దొరికినవే పంచభక్ష్య

పరమాన్నాలుగా భావించి, ఆబగా తినాలనుకోవడం సహజం. రంతిదేవుడి కుటుంబం కూడా అదే చేయబోయింది. కాళ్ళూ చేతులూ కడుక్కొని ఆ దొరికిన పాయసాన్ని పంచుకొని తినాలనుకొన్నారు వారంతా.

కానీ అంతలో ఒక బ్రాహ్మణుడు వచ్చాడు. ఆకలేస్తోందన్నాడు. తినగా మిగిలింది దానం చేయడం గొప్ప కావచ్చు, కానీ అన్ని రోజుల పాటు అసలు అన్నమే లేకుండా కనీసం మంచినీళ్ళు కూడా తాగకుండా ఉన్న రంతిదేవుడూ, అతని కుటుంబసభ్యులూ ఆ అతిథికి ఆహారపదార్థం ఇవ్వాలని నిశ్చయించుకొన్నారు. తమ దగ్గర ఉన్న పాయసంలో అర్ధభాగం ఇచ్చేశారు.

మిగిలినది తినాలనుకొనేలోపు ఒక శూద్రుడు వచ్చి 'ఆకలిగా ఉంది బాబూ' అని కన్నీరు కార్చాడు. రంతిదేవుడు లేదనక ఆ పాయసంలో మిగిలిన సగంలో ఓ సగాన్ని ఇచ్చాడు. అతను వెళ్ళీ వెళ్ళగానే మరొకరు.. ఆపై ఇంకొకరు.. ఇలా ఒకరి తర్వాత ఒకరుగా రంతిదేవుడి దగ్గరకు రావడం.. మొత్తం పాయసాన్ని తీసేసుకోవడం, ఆ మంచి నీళ్ళు సైతం అర్థించడం జరిగిపోయింది.

అయినా 48 రోజుల పాటు పచ్చి మంచినీళ్ళయినా తాగని రంతిదేవుడు దొరక్క దొరక్క దొరికిన పదార్థాన్ని సైతం దానం చేసి, అంతే ఆనందంతో నిలిచాడు.

ఈ కథ అందించే పరమార్థం ఏమిటి? నిజాయతీగా నిర్భీతితో ఒప్పుకొంటే... మనమెవ్వరం రంతిదేవుడిలా నేడు ప్రవర్తించలేం. కాలధర్మాన్ని ఆచరిస్తే అలా ప్రవర్తించకూడదేమో కూడా! కానీ, రంతిదేవుడిలా మొత్తం ఆస్తిని మనం దానం చేసేయక్కర్లేదు. రంతిదేవుడిలా మనం విపరీతంగా దానధర్మాలు చేసేసి బికారులం కానక్కర్లేదు. కానీ... ఆ మహానుభావుడి ఆదర్శాన్ని స్వీకరించి, మనకు కలిగినంతలో 'ఏదైనా' చేద్దాం.

అంటే మనం రోజూ అన్నం వండుకొంటాం. రోజూ కొనగుప్పెడు బియ్యాన్ని పక్కన పెడదాం. నెలయ్యేసరికి ముప్ఫయ్ గుప్పెళ్ళ బియ్యం అవుతుంది. దాన్ని ఏ అనాథ శరణాలయానికో దానం చేద్దాం.

అంటే రంతిదేవుడిలా మనం ఆస్తుల్ని కరిగించుకోవద్దు. వీధిన పడవద్దు. మన సుఖాల్ని మరవద్దు. మన కుటుంబధర్మాల్ని విడవవద్దు. రంతిదేవుడు ఒక పర్వతం. మనం ఒక్కొక్కరం ఒక్కో ఇసుక రేణువు. ఒక్క ఇసుక రేణువు ఏమీ చేయలేదు. కానీ మనమంతా... మన కాలనీలోని వందమంది, మన ఊళ్ళోని వెయ్యిమంది, మన నగరంలోని లక్షమంది... మన రాష్ట్రంలోని కోట్లమంది... ఒక్కొక్కరం కొంత... మనకు ఉన్నంత.. మనకు తోచినంత సాయం చేస్తే... చెప్పలేనంత సహాయం సమాజానికి!

'పరోపకారార్థ మిదం శరీరమ్' అన్నది నాటి మాట. సొంతలాభం కొంత మానుకొని పొరుగువాడికి తోడుపడడం నేటి మాట. నాటి రంతిదేవుడి దేహం విడివడి కొన్ని కోట్ల శకలాలై నేడు ఇదిగో ఇలా కోట్లాది మందిగా జన్మించాడనుకొందాం. మన 'పరిధి'లో మనం కూడా ఎంతో కొంత చేద్దాం. ❖

చిన్నారి చిరుకానుక

"నాన్నా, ఈ కుర్రాడెవరు?" అని వార్తాపత్రిక చదువుతున్న తన తండ్రిని అందులో ఉన్న ఫోటో గురించి అడిగాడు ఐదేళ్ళ సంజీవ్ కుమార్. "అతనికి గుండె జబ్బు బాబూ. సాయం చెయ్యమని అడుగుతున్నారు. ఆపరేషన్ చెయ్యకపోతే జీవించడం కష్టమట" అని బదులిచ్చాడు తండ్రి వేణుగోపాల్.

"ఆ సాయం మనం చెయ్యలేమా నాన్నా?" అడిగాడు సంజీవ్. "అంత డబ్బు మన దగ్గర లేదుగా..." బదులిచ్చాడు నాన్న. "సరేగానీ నాన్న, నాకు ఈ దీపావళికి ఎన్ని రూపాయల బాణసంచా కొనిస్తావ్?" అని అడిగాడు ఈ చిన్నారి. తండ్రికి ఈ ప్రశ్న ఎందుకో అర్థం కాకపోయినా... "ఓ 2,500 రూపాయలవి కొంటాను" అని చెప్పాడు నాన్న.

"అయితే, ఆ డబ్బు ఆ అబ్బాయికిచ్చి సాయం చేద్దాం" అని సంజీవ్ చెప్పగానే ఒక్కసారి ఆ కన్న తండ్రికి ఒళ్ళు పులకరించింది, కళ్ళు చెమర్చాయి. చిన్న పిల్లాడికి వచ్చిన ఆలోచన తనకు రాలేదే అని సిగ్గుపడ్డాడు కూడా.

ఈ సంఘటన 2003లో జరిగింది. ఆ రోజు మొదలుకొని చిన్నారి సంజీవ్ తన తండ్రి ఇచ్చే పాకెట్ మనీతో ఓ 50 మందికి పైగా ఆపన్నులను ఆదుకున్నాడు. ఈ సాయాన్ని అతను పోస్ట్ ద్వారా పంపిస్తాడు. సాయమందుకున్నవారు కృతజ్ఞతతో రాసే ఉత్తరాల్ని చూసి పరమానందం పొందుతుంటాడు ఈ చెన్నై చిన్నారి. మరి మనం కూడా ఈ చిన్నారిలాగ ఆపదలో ఉన్న వారిని ఆదుకొందామా! ❖

సేకరణ : గుళ్ళపూడి శ్రీనివాసకుమార్

చిగురంత ఆశతో ముందడుగు వేద్దాం

– స్వామి సేవ్యానంద

జీవితంలో మనం ఎటువంటి పొరపాట్లు చేయకుండా పురోభివృద్ధి చెందాలని అంతా కోరుకుంటాం. అయితే, ఇది ఎన్నటికైనా సాధ్యమా? పిల్లలు తప్పటడుగులు వెయ్యకుండా నడవడం నేర్వలేరు కదా! కొంత కాలం తప్పటడుగులు వేస్తూ, దెబ్బలు తింటూ తమంతట తాము ఎలా నడవాలో, పరిగెత్తాలో నేర్చుకుంటారు. ఈ జీవిత గమనంలో మనమంతా పసివాళ్ళమే! అందుకే, మనకు తెలిసో, తెలీకో ఎన్నో పొరపాట్లు చేస్తుంటాం.

పొరపాట్లను సరిదిద్దుకునే నేర్పు:

స్వేచ్ఛా జీవితంలో అడుగుపెట్టే యువ తరం తప్పుడు నిర్ణయాలను తీసుకోవడం, తప్పు త్రోవ పట్టడం చాలా సహజమైన విషయం. మనం ఇలాంటి పనులు చేయ కుండా ఉండాల్సిందని చాలాసార్లు అను కుంటాం. అయితే వీటిని పదే పదే తలచు కొని కుమిలి పోవడం వలన కొంచెం కూడా ప్రయోజనం లేదు. మనం పొర పాట్లను ధైర్యంగా అంగీకరించి వాటిని సరి దిద్దుకునే ప్రయత్నం చేయాలి. భవిష్యత్తు లో ఇటువంటి పనులు ఇంకెప్పుడూ చేయనని దృఢ నిర్ణయం తీసుకోవాలి.

"పొరపాట్లను ఎప్పుడూ లక్ష్యపెట్ట వద్దు. ఆవు అసత్యమాడగా నేను ఎప్పుడూ వినలేదు. అయితే అది ఎప్పటికీ ఆవే కాని మనిషి కాదు. కాబట్టి అపజయాలను, పొరపాట్లను లెక్కచేయ వద్దు. లక్ష్యసిద్ధికై వేయి సార్లు పోరాడు. వేయిసార్లూ ఓటమి ప్రాప్తిస్తే మరోసారి ప్రయత్నించు" అని స్వామి వివేకానంద చెబుతారు. మనం ఎటువంటి పొరపాట్లనూ చేయకుండా ఉండడానికి పుట్టుకతోనే మనమంతా మహాపురుషులం కాలేదు కదా! మనం ఎన్ని పొరపాట్లను చేసినప్పటికీ వాటిని సరిదిద్దుకొని మహాపురుషులం కాగలం. ఇదే మనిషి గొప్పతనం.

పొరపాట్లు బంగారు మెట్లు: చాలా సందర్భాలలో మనం చేసిన చెడ్డపనులు, పొరపాట్లు మన పురోగమనానికి దారి చూపే కాంతి పుంజాలవుతాయి. "నేను కొన్ని ఒప్పులు చేసి, చాలా విషయాలలో తప్పులు చేసినందుకు సంతోషిస్తాను. ఎందుకంటే వాటి నుంచి నా జీవితంలో గొప్పపాఠాలు నేర్చుకొన్నాను" అని స్వామి వివేకానంద చెబుతారు. తెలివైన వారు తమ తప్పును వెంటనే తెలుసుకొని, మంచి మార్గంలో వెళ్ళే ప్రయత్నం చేస్తారు. వారు చేసిన పొరపాట్ల నుంచి మరిన్ని కొత్తపాఠాలను నేర్చుకొని, తమ జీవితాన్ని ఉత్తమ భావాలతో, ఆదర్శాలతో నింపి పురోగతి చెందుతారు.

క్షమాగుణం – ఉత్తముని లక్షణం: మనం ఇతరుల లోపాల్ని, వారు చేసిన పొరపాట్లను పదేపదే తలచుకోవడం వలన మన మనస్సు కలుషితం అవుతుంది. ఇతరులు తాము చేసిన తప్పును ఒప్పుకొని పశ్చాత్తాపం చెందాక వారిని క్షమించే క్షమాగుణం, విశాల హృదయం మనలో ఉండాలి. చేసిన తప్పును సరిదిద్దుకొని భవిష్యత్తులో ఉన్నతమైన స్థితికి వెళ్ళే సదవకాశం మనం వారికి కల్పించాలి.

"ధృతరాష్ట్రుని పుత్రుడైన దుర్యోధనుడు పాండవులతో గొడవపడి, వారితో చాలా చెడుగా ప్రవర్తించాడు. వారి రాజ్యాన్ని తీసుకోవడమేగాక వారిని అడవులకు పంపించాడు. అప్పుడు విదురుడు 'దుర్యోధనుడు రాజ్యాన్ని తిరిగి పాండవులకు ఇచ్చి, వారిని క్షమించమని కోరాలి' అని ధృతరాష్ట్రుడికి సలహా ఇచ్చాడు. దుర్యోధనుడు పాండవులకు అన్యాయం చేశాడని చెప్పడంతో ధృతరాష్ట్రుడు విదురుణ్ణి నిందించి, అతనిపట్ల చాలా కఠినంగా ప్రవర్తించాడు. విదురుడు దుఃఖంతో తిరిగి వెళ్ళాడు. విదురుడు వెళ్ళిన కొంత సమయం తరువాత ధృతరాష్ట్రుడు పశ్చాత్తాపం చెంది, తనను క్షమించాల్సిందిగా కోరుతూ తన అనుచరుణ్ణి విదురుని వద్దకు పంపించాడు. విదురుడు వెంటనే ఆనందంతో ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్ళి, 'నిన్ను చూడడానికి చాలా వ్యాకులతతో వచ్చాను. నిన్ను మనస్ఫూర్తిగా క్షమిస్తున్నాను' అని చెబుతాడు.

పొరపాట్లు, అభిప్రాయభేదాలు, కోపతాపాలు మన మధ్య సాధారణమైనప్పటికీ పశ్చాత్తాపం చెందే గుణం, క్షమాగుణం అలవరచుకోవాలి. "We may not be saintly enough to forgive, but we can forget atleast"– మనం ఇతరుల్ని క్షమించేంత మహోన్నతులం కాకపోయినా, కనీసం జరిగిన విషయాన్ని మరచిపోయే ప్రయత్నమైనా చేయాలి. అప్పుడే మనం అందరితో కలిసిమెలిసి ఆనందంగా జీవించగలం. ❖

– స్వామి పరిజ్ఞేయానంద

– కుమారి తన్మయి, విజయనగరం.

ప్రశ్న: నాకు భయమెక్కువ. దయ్యాలు రాత్రిపూట తిరుగుతుంటాయని ఇతరులు చెప్పడం వల్ల నాలో భయం మరింత ఎక్కువయింది. రెండు సంవత్సరాలుగా పగలు కూడా ఒంటరిగా ఎక్కడికీ వెళ్ళలేకపోతున్నాను. మనస్సంతా ఇదే ఆలోచనతో ఉండడం వల్ల ఏ పనినీ ఏకాగ్రతతో చేయలేక పోతున్నాను. ఈ భయం నుండి ఎలా బయటపడాలో తెలుపగలరు.



జవాబు: చిన్నపిల్లలు చీకటిలో భయపడతారు. కానీ మీరు పట్టపగలే భయపడుతున్నారు. బయట దయ్యాలు తిరుగుతున్నాయని ఎవరో చెప్పిన మాటల్ని నమ్మి భయపడుతున్నారంటే, 'మీ హృదయంలోనే సదా భగవంతుడు ఉన్నాడు' అన్న భగవాన్ శ్రీకృష్ణుని బోధపై మీకు విశ్వాసం లేదని తెలుస్తోంది. అంటే మాధవుని మాట కన్నా మానవుని మాటకే ప్రాధాన్యం ఇస్తున్నారన్నమాట!

If there is anything in the world which can be called sin, it is this - 'fear'. It is fear that is the greatest of all superstitions. It is fear that is the cause of our woes...

- Swami Vivekananda

'ఈ ప్రపంచంలో పాపం అనేది ఏదైనా ఉందంటే అది 'భయం' మాత్రమే. భయమే మూఢనమ్మకాలకు మూల కారణం. భయమే మన దుఃఖాలన్నింటికీ ముఖ్య కారణం' అని అంటారు స్వామి వివేకానంద.

నరేంద్రుడు (స్వామి వివేకానందుని బాల్యనామం) చిన్నప్పుడు స్నేహితులతో ఆడుకొనేటప్పుడు చెట్టెక్కి కొమ్మలు పట్టుకుని వ్రేలాడేవాడు. నరేంద్రుణ్ణి చెట్టు ఎక్కకుండా చేయాలని ఓ వృద్ధుడు నరేంద్రునితో 'ఆ చెట్టు మీద భూతం ఉంది. అది చెట్టెక్కిన వాళ్ళ గొంతు నులిమి చంపేస్తుంది' అన్నాడు. ఆ వృద్ధుని మాటలు విని నరేంద్రుని స్నేహితులంతా భయపడి పారిపోయారు. కానీ నరేంద్రుడు మాత్రం చెట్టెక్కి కొమ్మను పట్టుకొని వ్రేలాడుతూ ఆడుకోవడం మొదలుపెట్టాడు. కొంతసేపటికి ఓ స్నేహితుడు వచ్చి 'చెట్టు మీద భూతం ఉందని తాతయ్య చెప్పాడు కదా! వెంటనే చెట్టు దిగి వచ్చెయ్. లేకపోతే భూతం నిన్ను చంపేస్తుంది' అన్నాడు. అందుకు నరేంద్రుడు 'నువ్వు వట్టి పిరికివాడివి. ఆ తాతయ్య మాటలు నమ్ముతావా! ఒకవేళ తాతయ్య మాటలు నిజమే అయితే ఇన్ని రోజుల నుంచీ ఆడుకుంటున్న మనల్ని ఆ భూతం ఎందుకు చంపేయలేదు?' అని స్నేహితుణ్ణి ఎదురు ప్రశ్న వేశాడు. అప్పుడు ఆ స్నేహితుడు, నరేంద్రుడన్న మాటలు నిజమేనని తెలుసుకున్నాడు.

పైన చెప్పిన సంఘటనలో నరేంద్రుడు చెప్పిన మాటల్ని ఒక్కసారి గుర్తుచేసుకోండి. నిజానికి దయ్యాలు మీకు హాని చేయాలని అనుకుంటే రెండు సంవత్సరాలుగా హాని చేయకుండా ఎందుకున్నాయని మీరే ఆలోచించుకోండి. ఇతరులు చెప్పిన మాటల్ని నమ్మి మనస్సును దయ్యాలకొంపగా మార్చుకోవడమే మీ భయానికి అసలు కారణం.

Fear demoralizes character, destroys ambition, causes disease, paralizes happiness and prevent achievement.

- Sweth Marden

భయం ఉంటే వ్యక్తిత్వం వికసించదు, జీవిత గమ్యాన్ని ఏర్పరచుకోలేం, సంతోషంగా ఉండలేం, లక్ష్యాల్ని సాధించలేం.

మిమ్మల్ని ఆవరించింది పిరికితనం మాత్రమే. మీలో భయం పోవడానికి 'భూత పిశాచ నికట నహి ఆవై, మహావీర జబనామ సునావై' – ఎవరి నామాన్ని వింటే భూత ప్రేత పిశాచాలు దరిచేరవో అలాంటి మహావీర హనుమంతుని నామాన్ని స్మరించండి.

The wise man in the storm prays God, not for safety from danger, but for deliverance from fear.

- Ralph W. Emerson

వివేకవంతులు ఆపదల నుండి తమను కాపాడాల్సిందిగా భగవంతుణ్ణి కోరరు. భయ విముక్తుల్ని చేయాల్సిందిగా ప్రార్థిస్తారు. కాబట్టి దయ్యాల నుంచి రక్షించాల్సిందిగా భగవంతుణ్ణి ప్రార్థించడం కన్నా మీలో భయాన్ని తొలగించాల్సిందిగా ప్రార్థించండి. ❖

మీ సందేహాల్ని పంపాల్సిన చిరునామా :

యువవాణి

శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం,
దోమల్‌గూడ, హైదరాబాద్ – 500 029

అహింసో పరమోధర్మః

- స్వామి రఘునాయకానంద

ఈనాడు హింస అన్ని రంగాలలోను వ్యాపించింది. హింస అంటే కత్తులతో చేసేదే కాదు. సమావేశాలలో పాల్గొంటామని చెప్పి రాకపోవడం, స్నేహితులతో వస్తామని చెప్పి వేరే కార్యకలాపాలలో మునిగిపోవడం. స్వార్థబుద్ధితో తాము కోరినది దక్కలేదని చేసే దాడులు, హింసాత్మక క్రియలు, మారణహోమాలు, హత్యలు సర్వసాధారణమై పోయిన ఈ రోజులలో అహింస అనే పదమే హాస్యాస్పదంగా మారిపోయింది.

ఏ జీవినీ హంసించకుండా ఉండడమే అహింస అయితే మరి వైద్యుడు రోగిని రక్షించడానికి చేసే శస్త్రచికిత్స, దేశ రక్షణకోసం సైనికులు చేసే భీకరపోరాటం, తన బంధు వర్గాన్ని దుండగుల బారి నుండి రక్షించడానికి ఒక వ్యక్తి చేసే పోరాటం... ఇవన్నీ హింసాత్మక సంఘటనలైతే మరి వారంతా హింసను ప్రేరేపించిన వారవుతారా?

ఏది అహింస

ఈ పని హింస ఈ పని అహింస అని నిర్ణయించడం కార్యాన్ని బట్టి కాక భావాన్ని బట్టి ఏర్పడుతుంది. మనిషి జీవితంలో నడవడి అహింస. మనకు ఏవైతే హాని కలిగిస్తాయో, కష్టం కలిగిస్తాయో ఆయా విషయాలలో ఇతరులకు మనం హానికలిగించకూడదు. అంతేకాదు మన ఆలోచనల ద్వారా, చేతల ద్వారా, మాటల ద్వారా ఇతరులకు కష్టం కలిగించకుండా ఉండాలి. అహింసకు కావల్సింది – హాని కల్గించని మనస్సు, ప్రేమతో పలకరించే నోరు, ఇతరులకు సహాయపడే చేతులు. అహింస అంటే కేవలం హింసించకుండా ఉండడం మాత్రమే కాదు. అహింస అంటే ప్రేమను కూడా చూపించాలి. ఈ రెండూ కలిస్తేనే నిజమైన అహింస అంటారు మహాత్మా గాంధీ, క్షమాగుణం – అదే నిజమైన బలం.

ఆరోగ్య రక్షణకై అహింస

ఇతరులకు హాని కలిగించడం ద్వారా మనం ఒక విధమైన మానసిక రుగ్మతకు గురవుతాం. తద్వారా మానసిక ఆరోగ్యం క్షీణిస్తుంది. పతంజలి మహర్షి మానసిక అనారోగ్యానికి దోహదం చేసేవి చంపడం, అసత్యం పలకడం, కోపం, అజ్ఞానం అని చెబుతారు. 'ప్రతి దుర్భావం, ద్వేషపుటాలోచన అతి రహస్యంగా కొండగుహలో కూర్చొని తలచినా, అది నిక్షిప్తమై ఎప్పుడో ఒకప్పుడు అప్రతిహతశక్తితో, ఏదో ఒక రూపంలో నిన్ను తప్పకుండా పొందుతుంది'అని అంటారు స్వామి వివేకానంద. దుఃఖం మానసిక ఆరోగ్యాన్ని క్రుంగ దీస్తుంది. అందుచేత మన ఆలోచనలు సర్వుల హితం కోరేవిగా ఉండాలి.

అసూయ లేకపోవడం అహింస

అసూయ లేకుండడమే అహింసకు నిదర్శనం. ఎవరిపట్లా అసూయలేనివాడు ఎవడో అతడే మానవకోటిని ప్రేమిస్తాడు. లోకంలో అల్పమైన పేరు ప్రతిష్ఠల కోసం, నాలుగు రూపాయల కోసం ఒకరి పట్ల ఒకరు అసూయాద్వేష పూరితులవ్వడం చూస్తాం. హృదయంలో ఈ అసూయ ఉన్నంత వరకు పరిపూర్ణ అహింసను సాధించలేం. నిర్భయులకే అహింసను ఆచరించడం సాధ్యం. బలహీనులు అహింసను పాటించలేరు. ఇతరులు మనపై ద్వేషభావాన్ని ప్రదర్శిస్తే మనం వారిపై ప్రేమను ప్రదర్శించడానికి చాలా బలం అవసరం.

అసూయాద్వేషాలు లేకుండా, ఒకరినొకరు ప్రేమతో పలకరించుకొంటూ, మనసా వాచా కర్మణా వీలైనంత వరకు బుద్ధిపూర్వకంగా ఇతరులతో బాగా మెలగుదాం. సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని సాధిద్దాం. అదే అన్ని ధర్మాలలో కెల్లా పరమ ధర్మం–అహింసో పరమో ధర్మః ❖



- ఎమ్. గౌరీశంకరశర్మ

ఆత్మను గురించి అధ్యయనం చేయడమే ఆధ్యాత్మికత. ఆత్మ శబ్దానికి వేదాల్లో, ఉపనిషత్తుల్లో, పురాణాల్లో చాలా అర్థాలు ఉన్నాయి. అన్నింటి సారం స్థూలంగా అర్థం చేసుకుంటే - తనను గురించిన అధ్యయనమే ఆధ్యాత్మికత. ఆత్మవిశ్వాసం, ఆత్మాభిమానం, ఆత్మబలం మొదలైన పదాలు మనం వింటూనే ఉంటాం. అవన్నీ ఆత్మకు సంబంధించినవే.

పాశ్చాత్య సంస్కృతి ప్రభావం వల్ల నేటి యువతరంలో ఆధ్యాత్మిక భావాలు నానాటికీ కొరవడుతున్నాయి. రోజు రోజుకూ మానవుడు తన సహజత్వాన్ని కోల్పోతున్నాడు. ఇది ఇలాగే కొనసాగితే చివరకు తన అస్తిత్వాన్నే కోల్పోయే ప్రమాదం ఉంది. దీనిపై నేటి విద్యావిధానం ప్రభావం చాలా ఉంది. ఈనాటి విద్య యాంత్రికమైన విద్య. ఈ యాంత్రికత మనుష్యుల్లో ముఖ్యంగా యువకుల్లో ప్రబలంగా కనపడుతోంది. విద్య లక్ష్యం తనను గురించి తాను తెలుసుకోవడం. "యా విద్య సా విముక్తయే విద్యయాఽమృత్ మశ్నుత్" అని ఆర్యోక్తి. ఇలాంటి విద్య గ్రంథాలకు మాత్రమే పరిమితమై పోయింది. ఈనాటి యువతరం కంప్యూటర్ విద్య, వ్యాపార విద్య మొదలైన వాటి వైపు మొగ్గుచూపడం జరుగుతోంది.

భారతదేశం, ఆర్యావర్తం, పుణ్యభూమి, కర్మభూమి అని చెబుతారే కానీ మాటల్లో, చేతలలో ఈనాటి తరం చూపించడం లేదు. సంస్కృతి, సంప్రదాయం, ఆచారాలు లాంటి ఆధ్యాత్మిక విలువల్ని మరచిపోతున్నారు. "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" (ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలుంటారు) అనే సంస్కృతి మనది. ఎంతసేపూ మనిషి కొత్త కొత్త పరిశోధనలు చేసి యంత్రాలు కనుక్కుంటున్నాడు, కనిపెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు కానీ తనను తాను తెలుసుకోడానికి ప్రయత్నించడం లేదు. ఇతర గ్రహాల మీద మనుష్యులున్నారా? లేదా? ఏ గ్రహం ఎక్కడుంది? ఏ గ్రహంపై ఏముంది? అని పరి పరి విధాల పరిశోధిస్తున్నాడు, కానీ తనలో ఏం శక్తులున్నాయో గ్రహించలేకపోతున్నాడు. అంతరిక్షయానం కోసమేగానీ అంతరంగయానం గురించి ఎవ్వరూ ఆలోచించడం లేదు.

ఎందరో మహానుభావులు "నరత్వం దుర్లభం లోకే" - 'మానవజన్మ లభించడం చాలా కష్టమ'ని చెబుతారు. అలాంటి మనుష్య జన్మ వ్యర్థం చేసుకుంటున్నాడు. మానవుడు ఒక అద్భుతమైన శక్తి కేంద్రమని మహర్షులు చెబుతారు. ఆ శక్తిని కనుగొనడానికి కావలసిన స్థితప్రజ్ఞత, విజ్ఞానం, మానసిక స్థితి యుక్తవయస్సులో మాత్రమే ఉంటుంది. అలాంటి మనస్సును తాత్కాలికమైన ఫలితాలనిచ్చే భౌతిక విషయాలకు

> *ఆత్మను మరచి అస్థిపంజరం వైపు దృష్టిని మరల్చిన మానవులు 'నేను', 'నేను' అని భ్రమిస్తున్నారు. బలహీనతలన్నింటికీ ఇదే మూలం. మన ఆత్మ శక్తిని మనం విశ్వసించకపోవడమే నాస్తికత అని వేదాంతం బోధిస్తుంది. ఎల్లప్పుడూ ఆత్మను గురించి వినండి, ఆత్మను గురించి మాట్లాడండి, ఆత్మను గురించి విచారణ చేయండి. అప్పుడే మీలోని ఆత్మ మేల్కొంటుంది.*
>
> - స్వామి వివేకానంద

వాడుకోవడం జరుగుతోంది. కొంతమంది యువకులు వృద్ధాప్యంలో ఆధ్యాత్మికత గురించి ఆలోచించవచ్చు, అప్పుడే తొందర ఏమొచ్చింది అంటారు. కానీ దానికి యుక్త వయస్సే సరైనది. శారీరక దారుఢ్యం ఉన్నప్పుడే మనస్సు దృఢంగా ఉంటుంది. యువత ఈ భౌతిక పరిధిని దాటి ఆలోచించాలి, అన్వేషించాలి. తన కాళ్ళమీద తాను నిలబడాలి అంటే మనిషి స్వయంశక్తిపై ఆధారపడి జీవించడం నేర్చుకోవాలి. నేటి యువత ఇంద్రియాలకు బానిసలై అనేక వ్యసనాలకు లోనైపోతున్నారు. బావిలోని కప్పల్లాగ బ్రతుకుతూ అదే సర్వస్వం అనుకుంటున్నారు. ఈ బానిసత్వానికి స్వస్తి పలకాలి. నిజ స్వరూపాన్ని గ్రహించాలి. మొట్టమొదట తన అజ్ఞానాన్ని గ్రహించాలి. స్వామి వివేకనాంద "బలమే జీవనం - బలహీనతే మరణం" అన్నారు. బలమంటే మానసిక బలం అని అర్థం. మానసిక బలంతో మనిషి కనీవినీ ఎరుగని అద్భుతాలను సృష్టించగలడు.

“సోత్సాహనాం నాస్త్యసాధ్యం నరాణాం” – అంటే ఉత్సాహవంతులకు ప్రపంచంలో అసాధ్యమంటూ ఏమీ లేదు. ఆ ఉత్సాహం మానసిక బలం వల్లే వస్తుంది. దీనికి తగినట్లుగా తల్లితండ్రులు కూడా జీవిత పరమార్థాన్నీ వారికి తెలియజేయాలి. చిన్నప్పుడే మంచి భావాలు నేర్పితే, పెరిగిన తర్వాత కూడా ఆ ప్రభావం ఉంటుంది.

ఈనాటి విద్యావిధానం ఒక సమాచార సేకరణ మాత్రమే; ఆధ్యాత్మికాంశాలు అణుమాత్రమైనా ఉండవు. ‘సత్యమేవ జయతే’ అనేమాటకు అర్థం చెప్పేవారూ, గాంధీగారి ‘స్వతంత్ర’ శబ్దానికి అర్థాన్ని వివరించేవారూ, శంకరాచార్యుల జీవుడు–పరమాత్మ అనే పదాలకు ఆలోచన కల్పించేవారూ, రామకృష్ణ – వివేకానందుల సందేశాలని ఒంట బట్టించేవారూ ఎంతమంది ఉన్నారు? పూర్వకాలంలో పాఠశాలలు ఆశ్రమాలలా ఉండేవి. అక్కడ అన్ని విద్యలతో పాటు ఆధ్యాత్మిక విద్యనూ బోధించేవారు. అందుకే

ఆచార్యాత్ పాదమాదత్తే
పాదం శిష్య స్వ మేధయా ।
పాదం సబ్రహ్మచారిభ్యః
పాదం కాలక్రమేణ చ॥

‘విద్యార్థికి పావు భాగం గురువుగారు బోధిస్తే, పావువంతు జ్ఞానం తన మేధస్సుతో (స్వంతంగా) నేర్చుకుంటాడు. పావు తన తోటివారితో, పావు కాలగమనంలో (అనుభవపూర్వకంగా అదే వస్తుంది) నేర్చుకుంటాడు’ అనేవారు.

అది అక్షర సత్యం. కాబట్టి నేటి పరిస్థితుల్లో యువతరం మొదట మహాత్ముల చరిత్రలు తెలుసుకోవాలి. వారి బోధనల్ని చదివి ఆచరించడానికి ప్రయత్నించాలి. ఆ బాధ్యత తల్లితండ్రుల మీదా, ఉపాధ్యాయుల మీదా కూడా ఉంది.

రామాయణ, భారత, భాగవత గ్రంథాల్నీ, వివేకానందుని సూక్తులనూ చదివి తెలుసుకున్నట్లయితే యువతరానికి ఇంకా మంచి భవిష్యత్తు ఉంటుంది. కనుక యువతరం ఆర్థికాభివృద్ధి కోసమే కాకుండా ఆధ్యాత్మిక అభివృద్ధికి కూడా కొంచం సమయాన్ని కేటాయించడం ఎంతైనా అవసరం. అప్పుడే భారతీయ పూర్వ వైభవం, మహర్షుల ఆశయాలు సఫలీకృతమవుతాయి. ❖

మురికిలో కొట్టుమిట్టాడకు!

– ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

ఆశ చేత మనుజులాయువు గల నాళ్ళు
తిరుగుచుండ్రు భ్రమను త్రిప్పలేక
మురికి భాండమందు ముసురు నీగల భంగి
విశ్వదాభిరామ వినుర వేమ!

భావం : మనిషికి ఆశ ఉంటుంది; అది ఎంతో కావాలనే ఆశే; ఆ ఆశతో మానవులు ప్రాణమున్నన్ని రోజులూ తిరుగుతూనే ఉంటారు. ఆ భ్రాంతిలో పడి, దుర్గంధం ఉన్న కుండలో తిరిగే ఈగల్లా తిరుగుతూనే ఉంటారు.

జానెడు పొట్టకు సరిపోయేంత గాక ఇంకా ఎంతో సంపాదించాలనే కోరిక, తన ఏడు జానెల శరీరానికి ఏడు బంగళాలు కావాలనే కోరిక, తరతరాలకు సరిపోయేంత కూడబెట్టి పోవాలనే ఆకాంక్ష; మరణించే వరకూ ఇదే విధంగా ఆశతో వ్యవహరిస్తే – ఇక ఈ పరమ పదానికి, ఆ పరమాత్ముని సన్నిధికి చేరేదెలా!

అందుకే భ్రాంతిలో పడి తిరగడాన్ని యోగి వేమన నిరసిస్తున్నారు. ఆశ అనేది మురికి లాంటిది. మురికి చుట్టూ ఈగలు ముసురుతాయి. మానవులు ఈగలు కారు. మానవులు దివ్యత్వం వైపు వెళ్ళాలి. మురికి కుండలో మురగరాదు. ఇంత సువిశాల విశ్వంలోని దివ్య పరిమళాల్ని ఆఘ్రాణించాలి. అందు కోసం యోగమార్గాన్ని అనుసరించాలి. ధ్యానమార్గాన్ని అనుసరించాలి.

ఆశతో దుర్యోధనుడు, రావణుడు, హిరణ్యకశిపుడు, కంసుడు, తదితరులెందరో అశాంతిలో కూరుకుపోయారు. అంతటా అశాంతిని వ్యాపింపజేశారు. అందుకే ఆశ ఉండరాదు; మురికి కుండల్లో మురగరాదు. జీవితాన్ని పరమాత్మ అనే పరిమళ భాండాల్లో నిలపాలి. ఇదే వేమన వేదం, వేదాంతం. ❖



ముందుకు సాగిపో!

(1884 – 1967)

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గచీ,
15 జనవరి 1951

ప్రియమైన తారాపద!*

నీవు భగవద్గీత, శ్రీరామకృష్ణ కథామృతం చదువుతున్నావని తెలిసి ఆనందించాను. గీత వంటి గొప్ప గ్రంథం మరొకటి లేదు. మానవ జీవితంలోని అన్ని సందర్భాలకూ గీత పరిష్కారాలను చూపుతుంది. కథామృతం గీతకు వ్యాఖ్యానమేనని తెలుసుకో. రెండు గ్రంథాలూ బోధిస్తున్నది ఒకే పరమాత్మ గురించి.

మతమన్నది సృష్టి రహస్యాలన్నింటినీ అర్థం చేసుకొనే శాస్త్రం. చావు పుట్టుకలు, ఇహపరాలు - వీటికి సంబంధించిన రహస్యాలను వెల్లడిస్తుంది మతం. భౌతికశాస్త్రమన్నది మతశాస్త్రంలోని భాగం మాత్రమే. ఈ విశ్వానికి ఆవల ఉన్న మహాకారణాన్ని మతశాస్త్రం శోధన చేస్తుంది. ఈ పరిశోధనలో ఇమిడి ఉన్న పద్ధతినే మనం మతం అని అంటున్నాం.

వైదిక మతం అంతరించి, దాని స్థానాన్ని మూఢనమ్మకాలు ఆక్రమించాయి. సమాజాన్ని ఉన్నత స్థానంలో నిలువలేకపోయి, జీవిత సమస్యలను తీర్చలేకపోయినప్పుడు దాన్ని మతం అనడం కన్నా, పాపం అనడం సబబు.

దేశ పరిస్థితులను గమనించు. ఎక్కడా, ఏ పనీ ఒక విధివిధానం ప్రకారం జరగడం లేదు. మనకు స్వాతంత్ర్యం లభించినది మొదలు అనాత్మవాదం, విలువల రాహిత్యామూ పుష్కలంగా దర్శనమిస్తున్నాయి. ఈ దేశానికి ఇప్పుడు అన్ని రంగాలలోనూ నిజమైన మనుష్యులు కావాలి. సంపూర్ణ మానవ వికాసమే జీవిత లక్ష్యం కావాలి.

నీకు ఉన్న సమయంలో మూడు వంతులు పఠనానికీ, ఒక వంతు దాన్ని ప్రతిఫలింప చేసుకోడానికీ వినియోగించు. జపధ్యానాలను క్రమం తప్పక సాధన చేస్తుండు. భగవన్నామాన్నీ, ఆయన లీలలనూ స్మృతిపథంలో ఉంచుకో! అప్పుడు నీ మనస్సు, ఇంద్రియాలూ నీ అదుపులో ఉంటాయి.

కాలాన్ని సమర్థంగా వినియోగించడంలో జాగ్రత్త వహించు. పురాణ గ్రంథాలు ప్రతినిత్యం చదువుతుంటే నీకు పఠనా సామర్థ్యం పెరుగుతుంది. నిరంతరం భగవానునిపై ధ్యాస ఉంచితే, నీ మనస్సు అదే భావంతో ఘనీభవిస్తుంది.

ఒక ముఖ్యమైన విషయం నువ్వు అర్థం చేసుకోవాలి. మనం ఈ ప్రాపంచిక లంపటాల్లో పడి అనేక జన్మలు గడిపాం. కేవలం కొద్ది సంవత్సరాల్లోనే మన ఆలోచనలను, మనస్సును అదుపులోపెట్టి శ్రీరామకృష్ణులపై ఏకాగ్రం చెయ్యడం సాధ్యం కాదు. మనఃపూర్వకంగా గొప్ప జిజ్ఞాసతో నీవు చాలాకాలం పోరాటం సల్పాలి. లేకపోతే ఫలితం ఉండక పోగా పూర్తి నిరాశకు గురవుతావు. కలత చెందకుండా శ్రీరామకృష్ణులు మనకు రక్షణగా ఉన్నారని భావించు. ఆయన పైన విశ్వాసంతో మనం సాహసవంతులమై ఈ కఠోర మార్గంలో పయనిస్తున్నాం. ముందుకు సాగిన కొద్దీ ఆయన అనుగ్రహానికి సాక్షీభూతుల మవుతాం. నిర్భయంగా ముందుకు సాగిపో... అనుగ్రహాన్ని పొందే రోజు అతి సమీపంలోనే ఉంది.

ప్రేమాశీస్సులతో...
స్వామి ప్రేమేశానంద

(*కాలాంతరంలో రామకృష్ణ సంఘంలో 'స్వామి అబ్జజానంద'గా ప్రసిద్ధులు)

తెలుగుసేత : కె. త్రివిక్రమరావు



మౌనంగా బోధించిన మునీంద్రుడు

సదాశివ బ్రహ్మేంద్రుడు

“భారతదేశంలో (ఆధ్యాత్మిక) మహాపురుషులు ఏ కాలంలో అయినా కరువయ్యారని ఏ ఒక్కరైనా చూపించగలరా? భరతమాత విశాల దృక్పథం, ఉన్నతభావాలు గల ఋషులకు జన్మనిస్తూనే ఉంది. అలాంటి ఆధ్యాత్మిక రత్నాలు మౌనంగా యావత్ ప్రపంచంలోని ప్రజా సంక్షేమానికై పాటుపడుతూనే ఉన్నారు” అన్నారు స్వామి వివేకానంద. ఈ మహాత్ముల పట్ల మనఃస్ఫూర్తిగా నమ్మకం కలిగి ఉండాలి.

అలాంటి వారిలో సదాశివ బ్రహ్మేంద్ర ఒకరు. తిరుచినాపల్లి తాలూకాలో కావేరీ నదీతీరంలో ఉన్న ‘నేరూరు’ అనే గ్రామంలోని శివాలయంలో ఒక బిల్వ వృక్షం ఉంది. ఆ దేవాలయంలో ఉన్న ఈ మహాత్ముడి సమాధిని దర్శించడానికి జనులు తండోపతండాలుగా వెళ్తారు.

ఈ మహాత్ముని తండ్రి మోక్ష సోమసుందర అవధాని అనే పండితుడు. ఆయన తనకు ఒక కుమారుణ్ణి ప్రసాదించాల్సిందిగా రాముణ్ణీ, కృష్ణుణ్ణీ ప్రార్థించారు. తల్లి పార్వతి శివుణ్ణి ప్రార్థించింది. అందువల్ల అతనికి శివరామకృష్ణ అని నామకరణం చేశారు.

చిన్నతనం నుంచే ఆయనకు పూర్తి వైరాగ్య భావం ఉండేది. అతను ఊరూరూ తిరుగుతూ, భిక్షాటన చేస్తూ అడవుల్లో, నదీ తీరాల్లో గడిపేవాడు. నివసించడానికి తనకే వసతి లేనప్పుడు భగవంతుడికి వసతి ఎలా కలిగించగలడు! అందువల్ల మనస్సునే భగవంతుని నివాసంగా చేసి, భగవత్ ప్రార్థన చేసి, ఈ ‘మానసిక పూజ’ను ‘శివమానసిక పూజ’ అన్న గీతంలో వర్ణించారు:

“ఓ మహాదేవా! విశ్వవ్యాప్తుడవైన నిన్ను ఎక్కడ పూజించను! నీ బాహువులు, పాదాలు అంతటా వ్యాపించి ఉండగా నీ పాదప్రక్షాళన ఎలా చెయ్యగలను! గొప్ప నర్తకుడవైన నీ ముందు నేనెలా నృత్యం చెయ్యగలను!”

శివరామకృష్ణుని భక్తికి శివుడు స్పందించి కామకోటి పీఠానికి చెందిన పరమ శివేంద్ర సరస్వతీ స్వామిని గురువుగా స్వీకరించమని ఆజ్ఞాపించాడు.

గురువు ఇతనిలోని చైతన్యానికి ముగ్ధుడయి “సదా శివ” అని పిలిచారు. సదాశివుడు తన గురువుకు శుశ్రూషలు చేశాడు. అనేక కీర్తనలు రచించాడు. పండితుల సమక్షంలో తన విజ్ఞానాన్ని ప్రదర్శించాడు. బ్రహ్మసూత్రాలకూ, పతంజలి యోగ సూత్రాలకూ వ్యాఖ్యానం వ్రాశాడు. తన పాటలన్నిటినీ గురువుకు అంకితం చేశాడు. ఆయన రచించిన కీర్తనలలో ‘పరమ హంస గురు” అన్న పదం ఉంటుంది.

గొప్ప గొప్ప విద్వాంసులు ఇతని జ్ఞానాన్ని చూసి ఓర్వలేక పోయారు. వేదాంత చర్చల్లో అతని వద్ద ఓటమి పొందిన ఒక పండితుడు, గురువుకు సదాశివ గురించి ఫిర్యాదు చేసాడు. గురువు అతణ్ణి ‘నీవు ఎప్పుడు మౌనం వహిస్తావు’అని అడిగారు. “గురుదేవా! ఈ క్షణం నుంచే నేను మౌనం వహిస్తాను” అని చెప్పి మౌనాన్ని అవలంబించి, భావ యుక్తంగా ఎన్నో పాటలు రచించాడు. గురువునూ, ప్రాపంచిక సంప్రదాయాలనూ వదలి, దిగంబరుడై తిరుగుతుండే వాడు. బ్రహ్మానందభరితమైన ఆత్మ జ్ఞానాన్ని అనుభవించాడు.

ఒక రోజు మధ్యాహ్నం ఆయన ఒక ధాన్యపు రాశి ప్రక్కన కూర్చొని ధ్యానమగ్నులయ్యారు. సాయంత్రం రైతు వచ్చి ఆయనను చూసి దొంగ అనుకుని కొట్టడానికి కఱ్ఱ పైకెత్తాడు. అంతే! రాత్రంతా అతను శిలలా ఉండిపోయాడు. మర్నాడు ఉదయం స్వామి మామూలు స్థితికి వచ్చి, కృషీవలుణ్ణి చూసి నవ్వగా అతను మళ్ళీ చైతన్యవంతుడై తనను క్షమించాల్సిందిగా ప్రార్థిస్తూ స్వామి కాళ్ళ మీద పడ్డాడు. స్వామి మౌనంగా అక్కడ నుంచి కదిలారు.

ఒకసారి కావేరీ నదీ తీరంలో కూర్చొని సదాశివ బ్రహ్మేంద్ర స్వామి సమాధి మగ్నుడయ్యారు. బాహ్య ప్రపంచపు స్పృహను

కోల్పోయారు. కుండపోతగా వర్షం కురవసాగింది. అక్కడ నుంచి కదలాల్సిందిగా ఎందరో చెప్పారు. కానీ ఆయన చెవులకు వినపడలేదు. ఆయన ఇంద్రియాలు, మనస్సు అంతర్ముఖం అయి ఉన్నాయి. నీళ్ళలో ఆయన కొట్టుకు పోయారు. ఆయన మరణించారని జనులు దుఃఖించారు.

మూడు నెలల తరువాత ఒక వ్యవసాయదారుడు నదీ తీరంలోని ఇసుకను త్రవ్వి బండిలో పోస్తుండగా అతని పార రక్తసిక్తమయింది. అతను జాగ్రత్తగా త్రవ్వగా సదాశివ బ్రహ్మేంద్ర స్వామి మూడు నెలల క్రితం ఎలా కూర్చొని ఉన్నారో ఇప్పుడూ అలాగే ధ్యానమగ్నులై ఉన్నారు. జనులు ఆయనను శివావతారంగా భావించి పూజించసాగారు.

ఒక ఛాందస బ్రాహ్మణుడు స్వామి నిజంగా అవధూత కారనీ, నాటకమాడుతున్నారనీ చెప్పాడు. సదాశివ మౌనంగా ఒక చాకలి వాని దగ్గరకు వెళ్ళి, అతని నాలుక మీద ఏదో వ్రాశారు. ఆ చాకలి వెంటనే వేదమంత్రాలు పఠించాడు. ఏమి ఆశ్చర్యం! నిరక్షరాస్యుడు అతని స్పర్శ మాత్రం చేత జ్ఞాని అయ్యాడు. పండితుడు అజ్ఞాని అయ్యాడు.



ఒకసారి ఒక ముసల్మాన్ స్వామి భుజాన్ని ఖండించాడు. రక్తం ప్రవిస్తున్నా స్వామి ఏమీ కానట్టు నడచి వెళుతుంటే, అతడు తన కళ్ళను తానే నమ్మలేక స్వామితో 'మీ చేయిని ఖండించాను' అని చెప్పాడు. స్వామి నిదానంగా చేతిని తాకగానే అది యథాస్థితిని పొందింది. ముసల్మాన్, స్వామి కాళ్ళమీద పడి క్షమాపణ కోరాడు.

ఆయన ఆ విధంగా సమయం వచ్చినప్పుడు ఎన్నో అద్భుతాలను ప్రదర్శించేవారు. ఒకే సమయంలో ఎన్నో ప్రదేశాలలో కనిపించేవారు. భక్త బృందం తనతో ఉండాలని ఎన్నడూ తలచలేదు. పిల్లలు అమాయకంగా ఉంటారు కనుక వారిని ఇష్టపడేవారు.

జీవితపు చివరిదశలో స్వామి నేరూరులో స్థిరపడ్డారు. ఒకసారి పిల్లలు మదురైలో జరుగుతున్న సంత చూడాలని ఆసక్తి చూపిస్తే, వారిని కళ్ళుమూసుకోమని మదురైకు తీసుకువెళ్ళి సంత చూపించి తినుబండారాలు కొనిపెట్టి మళ్ళీ కళ్ళు మూసుకోమని నేరూరుకు తిరిగి తీసుకువచ్చారు స్వామి.

పిల్లలు తమ అనుభవాన్ని చెప్పగా తల్లితండ్రులు ఆశ్చర్య చకితులయ్యారు. స్వామి ఒకే సమయంలో కాశీ, నేరూరు, కంచి, పూరీ – అన్ని చోట్లా కనిపించారు.

స్వామి బంధాలు లేకుండా సన్న్యాసిగా ఇతరుల బాగు కోసమే జీవించారు. మరణ సమయం ఆసన్నమవగానే తన శిష్యులకు కబురుపెట్టి, "నేను ఈ భౌతిక శరీరాన్ని చాలిస్తున్నాను. మీరు నాకు సమాధి కట్టి దానిపై బిల్వ వృక్షం నాటండి. ఆ సమయంలో కాశీ నుంచి ఒక బ్రాహ్మణుడు తెల్లని శివలింగాన్ని తీసుకు వస్తాడు. ఆ లింగాన్ని నా సమాధి ముందు ప్రతిష్ఠించి నిత్యం పూజించండి. భగవంతుడి మీద నమ్మకం ఉంచండి. శాశ్వతుడైన భగవంతుణ్ణి పొందండి. ఇంద్రియాలనూ, మనస్సునూ మీ అధీనంలో పెట్టుకోండి" అని తన చివరి సందేశాన్ని వ్రాశారు. భక్తులు దుఃఖాన్ని ఆపుకోలేకపోయారు. ఒక భక్తుడు "భగవంతుడా! నువ్వు వదిలి వెళితే మమ్మల్ని ఆదుకునేదెవరు? నువ్వు లేకుండా మేము జీవించలేం. మాకు భగవంతుణ్ణి చేరడానికి తోవ చూపించు" అని విలపించాడు. సదాశివ స్వామి మరణిస్తూ అతి ప్రయాసతో కళ్ళు తెరచి, తన చివరి సందేశాన్ని కీర్తన ద్వారా తెలియజేశారు.

'సర్వం బ్రహ్మమయం.. సర్వం బ్రహ్మమయం..' – భగవంతుడు అంతటా ఉన్నాడు. అంతటా ఉన్న భగవంతుణ్ణి నువ్వు ఎక్కడ వెతుకుతావు? మనం అందరం బ్రహ్మంలోనే ఉన్నాం.

ఇప్పటికీ నవరాత్రి 'సమాధి దినం' పెద్ద ఎత్తున జరుపుతారు. దేవాలయంలో జరిగే పూజల నిమిత్తం ఖర్చుల కోసం పుదుక్కోట్టై మహారాజు ఒక గ్రామాన్ని దానం చేశాడు. ఆ ధన సహాయంతో ఉత్సవాలు జరుపుతారు. జీవించి ఉన్నప్పుడు కట్టులా ఉండి ప్రజలకు సహాయపడ్డారు. మరణానంతరం చెట్టుగా ఉంటూ మానవాళికి సహాయపడుతున్నారు. మహాత్ములు తాము జీవించి ఉన్నా, మరణించినా మానవ జాతి హితవునే కోరుతారు. ❖ **సేకరణ : శ్రీమతి కె. జానకి**

రామకృష్ణ మఠం

విజ్ఞానానంద మార్గ్, ముఠిగంజ్, అలహాబాద్-211 003 (ఉత్తర ప్రదేశ్)
ఫోన్: 0532 - 2413369, ఫ్యాక్స్: 2415235 Email : rkmathald@dataone.in



త్రివేణీ సంగమ క్షేత్రంలో నూతన శ్రీరామకృష్ణ దేవాలయం

ప్రియమిత్రులారా!

ప్రయాగ (అలహాబాద్)లోని రామకృష్ణ మఠం 2010లో శతవార్షికోత్సవాలు జరుపుకోనుంది. ఈ శుభవార్త మీతో పంచుకోవడానికి ఆనందిస్తున్నాం. భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష శిష్యులలో ఒకరైన స్వామి విజ్ఞానానందజీ మహరాజ్ 1910లో ఈ మఠాన్ని ప్రారంభించారు. వారు ఆధ్యాత్మిక శక్తి సంపన్నులు, జీవన్ముక్తులు. స్వామి విజ్ఞానానందజీని రామకృష్ణ సంఘ ప్రథమ అధ్యక్షులూ, శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక పుత్రుడూ అయిన స్వామి బ్రహ్మానందజీ మహరాజ్ 'గుప్త బ్రహ్మజ్ఞాని' అనేవారు. విజ్ఞానానందజీ జీవితమంతా దివ్యదర్శనాలతో నిండి నది. ఆయన తమ 28 సంవత్సరాల తీవ్ర తపస్సాధనల దివ్యశక్తితో మఠ వాతావరణాన్ని ప్రభావితం చేశారు; మఠాన్ని సందర్శించే భక్తులు ఇప్పటికీ ఆ దివ్యశక్తి ప్రభావాన్ని అనుభూతి చెందుతారు.



ఈ ఆధ్యాత్మిక శక్తి చైతన్యాన్ని ప్రతి ఒక్కరూ తమ జీవితంలో సాక్షాత్కరింప చేసుకొనే విధంగా భగవాన్ శ్రీరామకృష్ణుల విశ్వజనీన దేవాలయాన్ని నిర్మించాలని చాలా సంవత్సరాలుగా అనుకుంటున్నాం.

అందుకు ప్రస్తుత ప్రార్థనా మందిరాన్ని 2010లోగా దివ్యమైన ఆలయంగా తీర్చిదిద్ది, శ్రీరామకృష్ణుల చలువరాతి ప్రతిమను ప్రతిష్ఠించాలని నిశ్చయించాం. జాతి మత విచక్షణ లేకుండా అందరూ దేవాలయానికి వచ్చి ధ్యానం చేసుకోవచ్చు.

రామకృష్ణ మఠం, మిషన్‌ల అధ్యక్షులు శ్రీమత్ స్వామి ఆత్మస్థానందజీ మహరాజ్ 2008, ఏప్రిల్ 11న ఈ ఆలయానికి శంకుస్థాపన చేశారు. రానున్న జనవరి నెలలో ఆలయ మహాసంప్రోక్షణ జరుగనుంది.

ఈ బృహత్తర ఆలయ నిర్మాణానికి సుమారు కోటి రూపాయలు వ్యయమవుతాయని అంచనా. ఈ ఉన్నత కార్యార్థం మిమ్మల్ని ఉదారంగా విరాళాలు ఇవ్వవలసిందిగా కోరుతున్నాం.

రామకృష్ణ మఠానికి ఇచ్చే విరాళాలన్నిటికీ 1961 నాటి ఆదాయపు పన్ను చట్టంలోని 80 (జి) విభాగం ప్రకారం పన్ను మినహాయింపు లభిస్తుంది.

"Ramakrishna Math, Allahabad" పేరున చెక్కు/ డి.డి. తీసి Ramakrishna Math, Vijnanananda Marg, Mutthiganj, Allahabad-211 003 కు పంపాల్సిందిగా మనవి. దయచేసి మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఇంగ్లీషు, లేక హిందీ భాషల్లోనే జరపాల్సిందిగా వినతి.

భగవాన్ శ్రీరామకృష్ణుల అనుగ్రహం అందరి మీదా వర్షించాలని వారి పాదపద్మాల వద్ద ప్రార్థిస్తూ...

భగవత్సేవలో
స్వామి త్యాగాత్మానంద
అధ్యక్షులు

Advt.

వివేక నాదమే వారి జీవన వేదం!

– కరణం గోపాలకృష్ణ పిళ్లై

నా జీవితంలో నన్ను సర్వదా వెన్నాడే మధురానుభూతి ఈ సంఘటన. అది 1967వ సంవత్సరం. చిత్తూరు జిల్లాలోని పూతలపట్టు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సామాన్యశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేసేవాణ్ణి. పూతలపట్టు అనగానే, ప్రసిద్ధ కంబ రామాయణాన్ని తమిళం నుండి ఆంధ్రీకరించిన పూతలపట్టు శ్రీరాములు రెడ్డి గారు జ్ఞాపకం రాక మానరు. ఆనాడు ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్షలుండేవి. పరీక్షలకు ముందు ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్ష వ్రాసే విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిపేవారు. అప్పుడు ఒక విద్యార్థికి ఆటోగ్రాఫ్‌గా స్వామి వివేకానందుల సూక్తి ఒకటి వ్రాసి సంతకం పెట్టి ఇచ్చాను.

ఇది జరిగిన సుమారు 15 సంవత్సరాల తర్వాత తిరుపతి నుండి చిత్తూరు వెళుతున్నాను. ఒక వ్యక్తి వినయంగా నమస్కారం చేస్తూ, నా ప్రక్కన ఖాళీ సీట్లో కూర్చున్నాడు. అతడే కొంతసేపటికి "నన్ను గుర్తు పట్టలేదా సార్" అన్నాడు. "గుర్తుకు రావడం లేదు" అన్నాను. "సార్! నా పేరు కుప్పన్. ఎస్.ఎస్.ఎల్.సి.లో మీరు మా క్లాస్ టీచర్. నేను అల్లరి చేస్తే మీరు కొట్టిన దెబ్బ గుర్తు చూడండి" అంటూ అతను తన కణతను చూపాడు. వెంటనే గుర్తొచ్చింది. కుప్పన్ మహా అల్లరి చేసేవాడు. అది తలచుకొని సన్నగా నవ్వుకున్నాను.

మార్గం మధ్యలో కుప్పన్ ఊరు బండపల్లి వచ్చింది. కుప్పన్ నన్ను బలవంతం చేసి బస్సు దింపి, వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళాడు. పోస్టల్ డిపార్టుమెంటులో తాను ఉన్నతాధికారిగా పనిచేస్తున్నట్టు చెప్పి, మిగతా కుటుంబ విషయాలన్నీ దారిలో క్లుప్తంగా చెప్పాడు. కొసమెరుపుగా, "ఇదంతా తమ ఆశీర్వాదమే సార్" అన్నాడు కల్లాకపటం లేకుండా! ఇంటికి చేరుకున్నాం. పెద్ద ఇల్లే! విశాలంగా ఉంది. భార్యా బిడ్డలను పరిచయం చేశాడు. చక్కని భోజనం పెట్టారు. సాయంత్రం నేను బయలు దేరుతున్నప్పుడు పండ్లు, పూలు, తమలపాకులు, ఖరీదైన బట్టలు పెట్టి సకుటుంబంగా సాష్టాంగ నమస్కారం చేశారు.

కాస్త ఆనందం, కాస్త మొహమాటంతో "ఇదంతా ఏంటి?" అన్నాను "ఏదో చిరుకానుక" అన్నారు దంపతులు భక్తి వినయాలతో. అంతలో కుప్పన్ పెద్ద పెద్ద అక్షరాలతో రంగులతో వ్రాయబడిన చక్కని పటాన్ని నా ముందుంచాడు. అందులో స్వామి వివేకానందుని గొప్ప సూక్తి "Arise, Awake and Stop not till the Goal is reached" బహు సుందరంగా వ్రాసి ఉంది. పటంలో కుడివైపున "స్వామి వివేకానంద" అని, ఎడమ వైపున కె. గోపాలకృష్ణ అని నా పేరు వ్రాసి ఉంది. "ఏంటయ్యా" అంటూ ఆశ్చర్యంగా చూశాను. "సార్! ఫేర్‌వెల్ రోజు నా ఆటోగ్రాఫ్‌లో మీరు ఈ కొటేషన్ వ్రాశారు. ఇదే నా జీవిత గమ్యమైంది. ఈ సూక్తి నాకూ, నా కుటుంబానికీ ఆదర్శమైంది. అందుకే ఈ సూక్తిని డ్రాయింగ్ మాస్టారు సయ్యద్ బాషాతో వ్రాయించి, ఫ్రేము కట్టించాను. ప్రతీ రోజూ ఈ సూక్తి చదివి, ఆ స్ఫూర్తితో మా కుటుంబం పనులు ప్రారంభిస్తుంది. మా అభివృద్ధికి స్వామి వివేకానందుని బోధలే మూలం. ఈ సూక్తులే మా జీవనానికి వేదాలు! నా ఆటోగ్రాఫ్‌లో ఈ సూక్తి వ్రాసిచ్చిన మీరే నా ఆదర్శ గురువులు" అని ఎంతో నమ్రతతో అన్నాడు కుప్పన్.

కుప్పన్ మాటలు విని నా కళ్ళు చెమర్చాయి. నేను వ్రాసిన స్వామి వివేకానందుల సూక్తిని అక్షరాలా పాటించి, కుప్పన్ నాకు నిజంగా గురువయ్యాడు. వట్టి మాటలే గానీ చేతలు లేని నేను కుప్పన్‌కు శిష్యుణ్ణయ్యాను. ❖

(కరణం గోపాలకృష్ణ పిళ్లై, పాకాల, చిత్తూరు జిల్లా)

With Best Compliments From :

SRI P. KRISHNA MURTHY

Plot.No. : 6/G-2, Huda Complex, Saroornagar, Hyderabad - 500 035

'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను ఆంధ్రప్రదేశ్‌లోని 1000 డిగ్రీ కళాశాలలకు ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు.



మహనీయుల జీవితాల్లో
మధురఘట్టాలు
- ఆర్. కృష్ణ

సత్యనిష్ఠలో స్థిరచిత్తుడు

మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీజీకి తండ్రి నుంచి క్రమశిక్షణ, మంచి నడవడిక, తల్లి నుంచి దైవభక్తి అలవడ్డాయి. ప్రాథమిక విద్య పోరుబందరు, రాజ్‌కోట్‌లలో పూర్తయింది. గాంధీ చిన్నతనంలో హరిశ్చంద్ర నాటకం చూడడం జరిగింది. ఆ నాటకంలో హరిశ్చంద్ర చక్రవర్తి సత్యం కోసం తన భార్యను కూడా అమ్ముకుని కష్టాల పాలవడం గాంధీపై ప్రభావం చూపింది. అప్పటి నుంచి ఎన్ని కష్టాలు వచ్చినా సరే హరిశ్చంద్రుడిలా సత్ప్రవర్తనతో, నిజాయతీతో నడుచుకోవాలని భావించాడు. తన జీవితాన్ని పూర్తిగా సత్యనిష్ఠకు అంకితం చేశాడు.

ఒకనాడు గైల్స్ అనే ఆంగ్లేయుడు మోహన్‌దాస్ చదివే బడికి పరీక్షాధికారిగా వచ్చి, 'ఉక్త లేఖనం' (డిక్టేషన్) ద్వారా పిల్లల వర్ణక్రమ (స్పెల్లింగ్) సామర్థ్యాన్ని పరీక్ష చేస్తున్నాడు. ఆయన చెప్పిన అయిదు సరళమైన మాటలను మోహన్‌దాస్ తప్ప మిగిలిన అందరూ తప్పు లేకుండా వ్రాశారు. గాంధీ 'కెటిల్' అనే ఆంగ్ల పదానికి వర్ణక్రమం సరిగ్గా వ్రాయలేక పోయాడు. ఉపాధ్యాయుడు తనకు చెడ్డ పేరు వస్తుందని భయపడ్డాడు. ప్రక్క పిల్లవాని పలక చూసి, ఆ మాట వ్రాయాల్సిందిగా గాంధీకి ఆయన సైగ చేశాడు. గాంధీ మౌనంగా ఉండిపోయాడే కానీ చూసి వ్రాయలేదు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా మోసం చేసి, సత్యాన్ని కప్పి పుచ్చకూడదని అతనికి తెలుసు.

బ్రిటీషువారు మనదేశాన్ని పరిపాలిస్తున్న కాలంలో మన దేశ విద్యార్థులు పై చదువుల నిమిత్తం ఇంగ్లండు వెళ్ళేవారు. వెళ్ళిన వారు వివాహితులైనప్పటికీ అక్కడ మాత్రం అవివాహితులమని చెప్పేవారు. కారణం– ఇంగ్లండులో ప్రతి విద్యార్థీ అవివాహితుడే. గాంధీ కూడా ఇంగ్లండులో బ్రహ్మచారిగానే ప్రవర్తించాడు. బిడియం, పిరికితనం, తల్లికి చేసిన వాగ్దానాల కారణంగా స్త్రీలతో గాంధీ జాగ్రత్తగానే మసలుకొనేవాడు.

గాంధీ సిగ్గు, బిడియాలను పోగొట్టాలని తలచి ఓ వృద్ధ మహిళ ఒక స్త్రీని గాంధీ దగ్గరకు పంపబోయింది. ప్రమాదం గుర్తించి పూర్తి వివరాలతో గాంధీ ఆమెకు (వృద్ధమహిళ) ఒక లేఖ వ్రాశాడు:

"బైటనులో కలిసినప్పటి నుండి మీరు నన్ను సొంత తల్లిలా ప్రేమగా చూస్తున్నారు. నాకు పెళ్ళి అవడం మంచిదన్న భావంతో యువతుల్ని నాకు పరిచయం చేస్తున్నారు. ఈ వ్యవహారం ముదరక ముందే మీ ప్రేమకు నేను తగనని తెలియజేయడం నా కర్తవ్యమని భావిస్తున్నాను. నాకు ఇదివరకే పెళ్ళి అయిపోయిందని నేను మీతో పరిచయం అయినప్పుడే చెప్పి ఉండవలసింది. పెళ్ళి అయినా ఇక్కడ చదువుకునేందుకు వచ్చే విద్యార్థులు తమకు పెళ్ళి అయిందని చెప్పరనే విషయం నాకు తెలుసు. నేను కూడా అలాగే చేశాను. అయితే ఇప్పుడు మీకు ఆ విషయం ముందే చెప్పి ఉండవలసిందని నాకు బోధపడింది. మీకు చెప్పకుండా దాచినందుకు నేను విచారిస్తున్నాను. అయితే ఇప్పటికైనా మీకు నిజం తెలియజేసే ధైర్యాన్ని భగవంతుడు నాకు ప్రసాదించాడు. అందుకు సంతోషిస్తున్నాను. మీరు నన్ను క్షమించండి..."

గాంధీ ఈ లేఖ వ్రాసి పెద్ద బరువు దించుకున్నట్లు భావించాడు. ఇక ముందు సత్యనిష్ఠతోనే ప్రవర్తించాలని నిర్ణయించుకున్నాడు.

గాంధీ లేఖను అర్థం చేసుకున్న ఆ వృద్ధ మహిళ కూడా సహృదయతతో తిరిగి గాంధీకి లేఖ వ్రాసింది.

కొందరు లౌకిక వ్యవహారంలో అసత్యం ఉపకరించినంతగా సత్యం సహాయపడదని భావిస్తారు. ఈ విషయంలో గాంధీజీ సత్యం ద్వారా సాధించలేనిది ఏమీ లేదని అనుభవపూర్వకంగా తెలియజేశారు. సత్యనిష్ఠలో స్థిర చిత్తుడనని నిరూపించు కున్నారు గాంధీజీ. ❖ (అక్టోబర్ 2న గాంధీ జయంతి)

ఆగండి! ఆస్వాదించండి!!

స్వామి వివేకానంద అన్నట్లు మనం ఒక చట్రంలోని తెల్ల ఎలుకలలా దేని కోసం కష్టపడుతున్నామో, చివరికి ఏం సాధించబోతున్నామో తెలియకుండానే నిరంతరం పనిలో తలమునకలవుతున్నాం. దీని ప్రభావం మన దైనందిన జీవితంలో, ముఖ్యంగా మన కుటుంబ సంబంధాల పైన విశేషంగా ఉంటుంది.

బాల్యంలో ఉండే జిజ్ఞాస, సృజనాత్మకతలు ఈ పోటీ ప్రపంచపు ప్రవాహంలో కొట్టుకుపోయి, యుక్తవయస్సు వచ్చేసరికి కేవలం యాంత్రికంగా తయారవుతున్నారు ప్రతి ఒక్కరూ! మనం ఈ యాంత్రిక జీవనం నుండి బయటపడి జీవితంలో ప్రతి దాన్నీ ఆస్వాదించగలగాలి.

ఈ విషయాన్ని ఈ మధ్య చాలామంది వ్యక్తిత్వవికాస నిపుణులు నొక్కి చెబుతున్నారు. ప్రతీ క్షణాన్నీ ఎరుకతో ఆస్వాదించాలని వారంటారు. ఉదాహరణకు భోజన సమయంలో ఆహారం పళ్ళెంలో నుంచి కడుపులోకి వెళ్ళింది అన్నట్లు కాకుండా తినే ప్రతి ముద్దలోనూ రుచిని ఆస్వాదించాలంటారు. ఈ రకంగా మనం మన ఎరుకను వృద్ధిపరచుకోగలం. మనం ఎదుర్కొనే ప్రతి సమస్యా దాదాపు ఈ ఎరుక లేమి వల్లనే ఎదురవుతోంది.

మన జీవితాలు ఎంత యాంత్రికంగా తయారయ్యాయో అర్థం చేసుకోవడానికి వాషింగ్టన్ డి.సి లో ఒక సర్వేలో నిర్వహించిన ఈ ప్రయోగం చక్కని ఉదాహరణ. వాషింగ్టన్ మెట్రో స్టేషన్‌లో ఒక వ్యక్తి కూర్చొని వయొలిన్ వాయించడం ప్రారంభించాడు. దాదాపు 45 నిమిషాలలో అతడు బాచ్ (17వ శతాబ్దికి చెందిన పాశ్చాత్య సంగీతకారుడు, బీథోవెన్, మోజర్ట్‌ల శ్రేణికి చెందినవాడు) కూర్చిన కృతులను వాయించాడు. కొన్నివేల మంది అటు వైపు నుండే వెళ్తున్నారు. అతడు వాయించడం మొదలు పెట్టిన మూడు నిముషాలకు ఒక మధ్య వయస్కుడు అక్కడొక కళాకారుడు వాద్యం వాయిస్తున్నాడన్న విషయం గుర్తించాడు. నడక వేగాన్ని కాస్త తగ్గించి, కొద్ది క్షణాల పాటు అక్కడ ఆగి మళ్ళీ వేగంగా వెళ్ళిపోయాడు.

దాదాపు మరో నిముషం తర్వాత ఒక స్త్రీ ఒక డాలరు అక్కడ పడేసి ఆగకుండా నడక కొనసాగించింది. మరికొన్ని నిముషాల తరువాత ఒక వ్యక్తి గోడకు ఆనుకొని నిలబడి కాసేపు ఆ కళాకారుడి సంగీతాన్ని విన్నాడు. అతను కూడా వెంటనే గడియారం చూసుకొని, మళ్ళీ నడవడం మొదలుపెట్టాడు.

అందరిలోకీ ఎక్కువ ఆసక్తి చూపింది ఓ మూడేళ్ళ అబ్బాయి. తల్లితో వెళుతూ అక్కడ కళాకారుణ్ణి చూసి నిలబడిపోయాడు. వెంటనే ఆమె ఆ అబ్బాయిని అక్కడ నుండి లాక్కుపోయింది. ఆ అబ్బాయి ఈ కళాకారుడు కనిపించేంత వరకూ తల వెనక్కి తిప్పి చూస్తూనే నడిచాడు.

మొత్తం మీద ఆ కళాకారుడు వయొలిన్ వాయించిన ఆ 45 నిమిషాలలో కేవలం ఆరుగురు మాత్రమే ఆగి కాసేపు చూశారు. దాదాపు 20 మంది కొంత చిల్లర అక్కడ పడేసి, ఆగకుండా వెళ్ళిపోయారు. ఆ చిల్లర మొత్తం 32 డాలర్లు అయ్యింది.

ఇంతకీ అక్కడ ఆ స్టేషన్లో కూర్చొని వాయించిన కళాకారుడెవరంటే జోషువా బెల్. ఆస్కార్ అవార్డు లాంటివి అనేకం పొందిన యువ కళాకారుడతడు. అక్కడ అతడు వాయించినవి చరిత్రలో ఇంతవరకు వయొలిన్‌పైన వాయించని అత్యంత సంక్లిష్ట కృతులు. వాటి విలువ దాదాపు 3.5 మిలియన్ డాలర్లు ఉంటుందని అంచనా.

ఆనాటికి సరిగ్గా రెండురోజుల తర్వాత ఆ రోడ్డు ప్రక్కన వాయించిన సంగీతాన్ని అతడు బోస్టన్‌లోని ఓ ప్రముఖ సంస్థలో ప్రదర్శించాడు. దానికి ప్రవేశ రుసుము ఒక్కో వ్యక్తికి 100 డాలర్లు!

ఇది నిజంగా జరిగిన సంఘటనే! 'వాషింగ్టన్ పోస్ట్' వాళ్ళు ప్రజల గ్రహణశక్తి, అభిరుచి, ప్రాధాన్యాల గురించి తెలుసుకోవడానికి మారువేషంలో వున్న బెల్‌తో కలిసి చేసిన సాంఘిక ప్రయోగం ఇది. ఆ ప్రయోగంలోని ముఖ్య విషయాలు ఈ విధంగా ఉన్నాయి.

1. మనం మంచివాటిని ఆస్వాదిస్తున్నామా?
2. మనం వాటిని అభినందించ గలుగుతున్నామా?
3. మన ముందుకు వచ్చే నైపుణ్యాన్ని మనం గుర్తిస్తున్నామా?

ఈ ప్రయోగంలో జరిగిన దాన్ని బట్టి మనం ఈ క్రింది నిర్ధారణకు రావచ్చు. "ప్రపంచంలో ఒకానొక గొప్ప కళాకారుడు, చరిత్రలోనే అత్యుత్తమమైన సంగీతాన్ని వాయించేటప్పుడు మనం దాన్ని గుర్తించలేకపోతున్నామంటే, జీవితంలో ఇంకా ఎన్ని విషయాలను కోల్పోతున్నామో కదా!" ❖ సేకరణ : జి. సతీష్

... 17వ పేజీ తరువాయి.


9
ఋషులవైపు భయంగా చూస్తూ కవషుడు ఇలా విన్నవించుకున్నాడు:
“యాగం చూడాలనిపించి మీకు దూరంగా కూర్చున్నాను. దాహం వేసింది. మీ దగ్గరకు వస్తే ఆగ్రహిస్తారని నా దాహం ఇక్కడే తీర్చుకున్నాను. ఇందులో నా తప్పు ఏదైనా ఉంటే నన్ను క్షమించండి; కానీ నన్నిక్కడ నుంచి వెళ్ళమనకండి”.


10
ఋషులందరూ అతడికి నమస్కరిస్తూ.....
“మహానుభావా! మీ గొప్పతనాన్ని తెలుసుకోలేక అమర్యాదగా ప్రవర్తించాం; మమ్మల్ని మన్నించండి. దాహం తీర్చుకునేందుకు సరస్వతీ నదిని మీ వద్దకు రప్పించుకో గలిగిన మీ మంత్రశక్తి అపూర్వం. అది మాకు నేర్పండి. ఇప్పుడు మీరే యాగం పూర్తిచేయించండి”.


11
కవషుడు సంకోచిస్తూ...
“నేను బ్రాహ్మణుడను కాను. మీరు నన్ను మనఃస్ఫూర్తిగా మీలో కలుపుకోగలరా?”





14 కవషుడు వారితో కలసి సత్రయాగాన్ని పూర్తి చేయించాడు.

15 కవషుడున్న చోటుకు ప్రవహించిన సరస్వతీ నదికి 'పరిసారికము' అని పేరు వచ్చింది.

16 మన ప్రాచీనులు అపార విజ్ఞానాన్ని కలిగి ఉన్నప్పటికీ మనుష్యుల్ని కులం పేరుతో విడదీసి అమానుషంగా ప్రవర్తించే వారంటారు. అయితే తప్పు మనుష్యుల్లోనే ఉంది కానీ మన ప్రాచీన విజ్ఞానంలో లేదు. ఇందుకు ఉదాహరణ కవషుడి కథ.

గ్రంథ పరిచయం

కఠోపనిషత్తు

మరణానంతరం...

వ్యాఖ్యానం : స్వామి జ్ఞానదానంద
వెల:రూ. 25/-(తపాలా ఖర్చులు రూ. 20/-అదనం), పేజీలు : 150
ప్రతులకు : తెలుగు ప్రచురణల విభాగం
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్-500029
Email : rktelugubook@gmail.com ఫోన్. 040-27631149

కఠోపనిషత్తును 'కఠోపనిషత్తు మరణానంతరం...' అని పేర్కొనడం ఎంతో సమంజసం. మరణం గురించిన సత్యాలను మృత్యుదేవతను నచికేతుడనే బాలుడు సాహసించి ప్రశ్నించాడు. యమధర్మరాజు చెప్పిన జవాబులే కఠోపనిషత్తుగా రూపొందింది.



జనన మరణాలు అగ్రాహ్యమైనవి. జననం జరిగిపోయిన విషయం కనుక దానిని గురించి చేయగలిగింది ఏమీ లేదు. ఇకపోతే మరణం. మరణం అంటే ఏమిటి? అప్పుడు మనిషికి ఏం జరుగుతుంది? తరువాత అతడు ఏమవుతాడు? ఈ ప్రశ్నల జవాబులకు మనిషి నాటి నుంచీ నేటిదాకా విశ్వప్రయత్నం చేస్తూనే ఉన్నాడు.

కఠోపనిషత్తు మరణం గురించి విచారణ చేయడం కన్నా దానిని జయించి పరమసత్యాన్ని గ్రహించడమే ఉత్తమం అని చివరకు తేల్చింది. మనకు ప్రసాదితమైన మానవ జీవితాన్ని సముచిత రీతిలో గడపడమే అందుకు మార్గం అంటోంది కఠోపనిషత్తు. సరళమైన భాషలో, ఆధునిక పోకడలో సాగిన వ్యాఖ్యానంతో ఈ తరం పాఠకులకు ఇట్టే అర్థమై ఈ ఉపనిషత్తు ఎంతో ప్రయోజనకారి అవుతుందనడంలో ఎలాంటి సంశయమూ లేదు. ❖ - బ్రహ్మచారి హేమంత్

బ్రహ్మ సూత్రములు

ఆంగ్లమూలం: శ్రీ శివానంద సరస్వతీ స్వామి
ఆంధ్రానువాదం : శ్రీ స్వామి హంసానంద
వెల : రూ. 200/-, పేజీలు : 754
ప్రతులకు :దివ్యజీవన సంఘం, శివానందనగర్-249 192, హిమాలయములు, ఉత్తరాఖండ్.

ప్రస్థానత్రయంలో జటిలమని చెప్పదగ్గ బ్రహ్మ సూత్రాలకు ఆది శంకరులవారి భాష్యానికి అనుగుణంగా స్వామి శివానంద మహరాజ్ (దివ్య జీవన సంఘ వ్యవస్థాపకులు) వ్రాసిన ఆంగ్ల వ్యాఖ్యకు తెలుగు అనువాదం ఈ గ్రంథం. తొలి ముద్రణ 1983 లో జరిగింది. ఇంతకుముందు రెండు భాగాలుగా వెలువరిచిన భాష్యాన్ని ఇప్పుడు ఒకే సంపుటంగా ప్రచురించారు. శ్రీ హంసానంద స్వాములవారి అనువాదం చక్కగా సాగింది.

ఉపనిషత్తుల జ్ఞానం, సంస్కృత భాషా పరిజ్ఞానం బాగా ఉండి తెలుగులో పారిభాషిక పదాలు తెలిస్తే తప్ప ఇలాంటి అనువాదాలను చేయటం సాధ్యపడదు. పుస్తకంలోని భావ వ్యక్తీకరణ స్పష్టతను బట్టి శ్రీ హంసానంద స్వాములవారు త్రిభాషా కోవిదులని తెలుస్తుంది. ఆంగ్ల గ్రంథాన్ని చక్కగా అర్థం చేసుకుని తేటతెలుగులో అనువాదాన్ని కొనసాగించారు. ఈ భాష్యాన్ని తెలుగులోనికి అనువదించి శ్రీ స్వామీజీ ఆంధ్రులకు మహోపకారం చేశారు. తెలుగులో బ్రహ్మసూత్రాలను చదవాలనుకున్న వారికి ఈ పుస్తకం కల్పతరువుగా భాసిస్తుందని చెప్పవచ్చును. ❖ - ఆనంద

పండుగలు-పర్వదినాలు

అక్టోబర్ - 2009

03	శనివారం	:	లక్ష్మీ పూజ (సాయంత్రం హారతి తర్వాత)
14	బుధవారం	:	ఏకాదశి
17	శనివారం	:	దీపావళి - కాళీ పూజ
29	గురువారం	:	ఏకాదశి
30	శుక్రవారం	:	స్వామి సుబోధానంద జయంతి

నవంబర్ - 2009

01	ఆదివారం	:	స్వామి విజ్ఞానానంద జయంతి
12	గురువారం	:	ఏకాదశి
26	గురువారం	:	స్వామి ప్రేమానంద జయంతి
28	శనివారం	:	ఏకాదశి, గీతా జయంతి

శ్రీ రామకృష్ణ సేవాసమితి రజతోత్సవం

పశ్చిమగోదావరి జిల్లా **గరగపర్రు శ్రీరామకృష్ణ సేవాసమితి** ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2009 ఆగష్టు 28,29,30 తేదీలలో రజతోత్సవ వేడుకలను జరుపుకుంది. 29వ తేదీన జరిగిన బహిరంగ సభలో విజయవాడ రామకృష్ణ మిషన్ స్వామి స్వసంవేద్యానందజీ, రాజమండ్రి రామకృష్ణ మిషన్ స్వామి అచింత్యానందజీ, గుంటూరు డాక్టర్ పన్నాల శ్యామసుందర మూర్తి, కాకినాడ మస్తాక్ అహ్మద్ ప్రసంగించారు.

30వ తేదీన గుంటూరు శారదా మఠం ప్రవ్రాజికా ధర్మాత్మప్రాణా, ప్రవ్రాజికా త్యాగనిష్ఠాప్రాణా మాతాజీల ఆధ్వర్యవంలో సాధనా కార్యక్రమం నిర్వహించబడింది.

ఈ సందర్భంగా బాలరామకృష్ణ గేయ నృత్య రూపకం, శ్రీరామకృష్ణ పరమహంస నాటకం ప్రదర్శించబడ్డాయి. ❖

నివేదిక : ఎమ్. విశ్వనాథరాజు, కార్యదర్శి

శ్రీ రామకృష్ణ సేవాసమితి పంచమ వార్షికోత్సవం

అనంతపురం శ్రీరామకృష్ణ సేవాసమితి 2009 ఆగష్టు 8వ తేదీన పంచమ వార్షికోత్సవం జరుపుకుంది. కడప రామకృష్ణ మిషన్ స్వామి సుకృతానందజీ ఆధ్వర్యవంలో విష్ణుసహస్రనామ పారాయణం, పూజ, భజనలు జరిగాయి.

ఆ రోజు ఉదయం జరిగిన బహిరంగ సభలో 'శ్రీరామకృష్ణ జీవితం-ఆదర్శం' అనే అంశంపై స్వామి సుకృతానందజీ, 'స్వామి వివేకానంద - కర్మయోగం' అనే అంశంపై డాక్టర్ నాగత్రిశూలపాణి ప్రసంగించారు. శ్రీటి.చంద్రశేఖర్, శ్రీ జి.శ్రీధరమూర్తి సమితి నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాల్ని వివరించారు. సాయంత్రం ఆరాత్రికం తరువాత పూర్ణప్రజ్ఞ నాట్య శిక్షణాలయ నిర్వాహకురాలు శ్రీమతి గీతాలక్ష్మి నేతృత్వంలో బాలల నృత్యప్రదర్శనా కార్యక్రమాలు జరిగాయి. పూజ్య స్వామీజీ విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ❖

నివేదిక : డాక్టర్ నాగత్రిశూలపాణి, అధ్యక్షులు

యువజన సదస్సు

వివేకానంద యువ మహామండలి, విశాఖపట్నం శాఖ 2009 ఆగష్టు 16వ తేదీన యువజన సదస్సును నిర్వహించింది. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం రామకృష్ణ మిషన్ స్వామి గుణేశానందజీ, యువ మహామండలి ప్రథమ అధ్యక్షులు శ్రీ ఆర్.ఎస్. ప్రేమ్‌కుమార్, పతంజలి యోగకేంద్ర నిర్వాహకులు శ్రీ వేదభాస్కరమ్, శ్రీ ఎమ్. సత్యనారాయణరాజు పాల్గొని 'యువతకు ఆదర్శం వివేకానంద' అనే అంశంపై

ప్రసంగించారు. ఈ సదస్సులో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ❖ **నివేదిక : బి. శ్రీధర్, కార్యదర్శి**

పాఠ్యపుస్తకాల పంపిణీ : తూర్పుగోదావరి జిల్లా **పెదబ్రహ్మదేవం శ్రీ శారదా రామకృష్ణ సేవాసమితి** పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టింది. ఈ సంవత్సరం ఆగష్టు 3వ తేదీన 60 మంది పదవ తరగతి పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలనూ, ఇద్దరు విద్యార్థులకు నగదు బహుమతినీ రాజమండ్రి రామకృష్ణ మిషన్ స్వామి అచింత్యానందజీ ద్వారా సమితి అందజేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వామీజీ, శ్రీ వి. రామసుబ్బారావు 'ఆదర్శ విద్యార్థులు' అనే అంశంపై ప్రసంగించారు. ❖ **నివేదిక : నువ్వుల బాబ్జి, కార్యదర్శి**

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

1. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది కోర్సులకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) 'వేదచూడామణి' : ఋగ్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క అధ్యయనము
యోగ్యతలు : మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.
వయస్సు : 8 నుంచి 10 సంవత్సరాల మధ్య
స్టైఫండ్ : నెలకు రూ. 1,000/-

(ఆ) 'వేదార్థచూడామణి' : ఋగ్వేదము/ యజుర్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము
యోగ్యతలు : సంస్కృత పరిజ్ఞానముతో బాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.
వయస్సు : 15 సం॥, ఆ పైన
స్టైఫండ్ : నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగాలకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) వేదాధ్యాపకుడు : (సామవేదము/ అథర్వవేదము - వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)
కావలిసిన అర్హతలు : క్రమాంతము లేక పదాంతము
అదనపు అర్హతలు : ఏదైన మఱియొక వేదము/ వేదభాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవము : 2 సంవత్సరములు
సంభావన : నెలకు రూ॥ 8,000/- మొత్తము, సౌకర్యములతో

(ఆ) వేదభాష్యాచార్యుడు : (ఒక్కొక్క వేదానికి ఒక్కొక్కరు చొప్పున 4 ఖాళీలు)
విద్యార్హత : ఏదైనా వేద భాష్యంలో ఉత్తీర్ణత
అదనపు అర్హత : మరొక వేద భాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవార్హత : 5 సం॥
సంభావన : నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన దరఖాస్తు ఫారములను శ్రీ పి. **వేంకటేశ్వర్లు గారు, మేనేజింగ్ డైరెక్టర్, కాకతీయ సిమెంట్, సుగర్ & ఇండస్ట్రీస్ లిమిటెడ్, 'గురుకృప' (ఆంధ్రా బ్యాంకు ఎదురుగా), 1 - 10 - 140/1, అశోక్‌నగర్, హైదరాబాద్ - 500 020** (ఫోను: 040 - 27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టు ద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ఆ ముద్రిత దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్ని బట్టి ఖాళీలను పూరించుట లోనూ, అర్హతల సవరణ లోనూ మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

సం/-

హైదరాబాద్ కులప్రశాసకుడు

Sponsored by:
KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED
Regd. Office : 1 - 10 - 140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad - 500 020
Ph: 2763 7717, 2763 3627, Fax No. 040-27630172, Email: info @ kakatiyacement.com

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

సురభి

గురుదేవులు మహాసమాధి చెందిన కొన్ని రోజుల తర్వాత గురుదేవుల అన్నగారి కుమారుడైన శివరామ్‌తోపాటు మాతృదేవి కామార్పుకూర్ నుండి జయరాంబాటీ వెళుతున్నారు. మాతృదేవి ముందు నడుస్తూ ఉంటే శివరామ్ సామానుతో మాతృదేవి వెనుక నడుస్తూ వస్తున్నాడు. జయరాంబాటీ చేరుకోవడానికి ఇంకా కొంతదూరం ఉంది. అప్పుడు శివరామ్ హఠాత్తుగా ఆగిపోయి మాతృదేవిని ఇలా ప్రశ్నించాడు:

శివరామ్: పిన్నీ! నిన్ను నేను ఒక మాట అడుగుతాను. నిజం చెప్పు! నువ్వు నిజం చెబితేనే నేను నీ వెంట వస్తాను.

మాతృదేవి: ఏమిటది?

శివరామ్: నిజంగా నువ్వెవరు?

మాతృదేవి: నేను ఇంకెవర్ని? నీ పిన్నిని.

శివరామ్: నువ్వు నిజం చెప్పడం లేదు. ఇక నేను నీకు తోడురాను.

మాతృదేవి: నేను ఎవరని అనుకొంటున్నావు? నేను ఒక సామాన్య వ్యక్తిని మాత్రమే!

శివరామ్: నీవెవరో నిజం చెప్పేవరకూ నేను ఇక్కడ నుంచి కదలను.

ఇలా అంటూ అతడు అక్కడే నిలబడిపోయాడు. అతని పట్టుదల చూసిన మాతృదేవి, “కొందరు నన్ను కాళి అంటారు” అన్నారు.

శివరామ్: నిజంగానే నువ్వు కాళీవేనా?

మాతృదేవి: అవును. ❖

(‘శ్రీశారదాదేవి చరితామృతం’ నుంచి)

With Best Compliments From : **CHAIRMAN & MANAGING DIRECTOR**

THE KCP LIMITED

KCP కంపెనీ వారు ‘శ్రీరామకృష్ణ ప్రభ’ మాసపత్రికను 1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు.